మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు


NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 27-12-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 178 Issue: 178

27 డిసెంబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:48 సూర్యాస్తమయం - సా. 5:46 తిథి సప్తమి మ. 1:06 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం పూర్వాభాద్ర ఉ. 8:59 వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం వ్యతిపాత మ. 12:12 వరకు కరణం వనిజ మ. 1:06 వరకు విష్టి రా. 12:350 వరకు వర్జ్యం సా. 6:34 నుండి రా. 8:08 వరకు దుర్ముహూర్తం ఉ. 8:16 నుండి ఉ. 8:59 వరకు రాహుకాలం ఉ. 9:32 నుండి ఉ. 10:54 వరకు యమగండం మ. 1:39 నుండి మ. 3:01 వరకు గుళికాకాలం ఉ. 6:48 నుండి ఉ. 8:10 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:12 నుండి ఉ. 6:00 వరకు అమృత ఘడియలు తె. 3:59 నుండి తె. 5:33 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:39 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial www.evarthalu.com




## సంక్రాంతి సెలవులు 9 రోజులు

### జనవరి అంతా హాలిడేసే..!

రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాలలకు భారీగా సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి హాలీడేస్ ప్రారంభం కానున్నాయి. జనవరి 18 ఆదివారంతో సెలవులు ముగియనుండగా.. జనవరి 19 సోమవారం బడులు పునఃప్రారంభం అవుతాయి.

2



## సంక్రాంతికి రైతు భరోసా!

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): యాసంగి సాగు పనులు ఊపందుకుంటున్న తరుణంలో.. పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతు భరోసా నిధులను సంక్రాంతి పండుగ కానుకగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. రాష్ట్రంలో ఏటా రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ. 12,000 పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత వానాకాలం సీజన్‌లో కేవలం తొమ్మిది రోజుల్లోనే సుమారు రూ. 9,000 కోట్లను దాదాపు 69 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. ఇప్పుడు యాసంగి సీజన్ కోసం కూడా అదే తరహాలో నిధుల పంపిణీ జరగనుంది. ప్రస్తుత బడ్జెట్‌లో తరువాయి 2 వ పేజీలో...



# నీళ్ల కోసం కొట్లాడుడే

## తెలంగాణకు అన్యాయం చేస్తే ఊరుకోం

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై 'ఉద్యమ' భేరీ.. రాష్ట్ర హక్కులే ప్రధాన ఎజెండా

### అధినేత కేసీఆర్ స్పష్టీకరణ!.. ఎర్రవల్లిలో పార్టీ నేతలతో కీలక భేటీ

రాష్ట్రానికి రావాల్సిన నీళ్ల కోసం కొట్లాడుడేనని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్పష్టం చేశారు. శుక్రవారం పార్టీ ముఖ్య నేతలతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

గజ్వేల్, డిసెంబర్ 26 (ఈవార్తలు): కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై బలమైన పోరాటం అవసరమని కేసీఆర్ స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో కేంద్రం నిర్లక్ష్య ధోరణి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి కలిసి తెలంగాణ ప్రయోజనాలకు తీవ్రంగా భంగం కలిగిస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ స్పష్టత లేదని, చరిత్రలోనూ అదే ధోరణి కొనసాగిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో బీఆర్ఎస్ తప్ప తరువాయి 2 వ పేజీలో...



## ఢిల్లీకి రేవంత్

### నేటి సీడబ్ల్యూసీ భేటీకి హాజరు

### కార్పొరేషన్ల పదవులపై నిర్ణయం!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. శనివారం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సమావేశం నూతనంగా నిర్మించిన ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నారు.

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ కీలక సమావేశంలో దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులు, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు, రానున్న ఎన్నికలు, పార్టీ వ్యూహాలపై చర్చ జరగనున్నట్లు సమాచారం. ఈ సమావేశంలో పలువురు సీనియర్ నేతలు, పార్టీ కీలక నాయకులు పాల్గొననున్నారు. ఇదిలా ఉండగా, మంత్రివర్గంలో చోటు దక్కని ఎమ్మెల్యేలకు పలు కార్పొరేషన్లు కట్టబెట్టి, వారిని సంతృప్తిపరచాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ సమాచారం. అందులో భాగంగానే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భార్య, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని ఆర్టీసీ చైర్మన్‌గా నియమించాలనే ప్రతిపాదన ఉన్నట్టు సమాచారం. గతంలోనే శాసనసభ అంచనా పద్దుల కమిటీ చైర్మన్‌గా పదవి కట్టబెట్టినా ఆమె స్వీకరించలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డికి మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు చైర్మన్ లేక ప్రభుత్వ చీఫ్‌విప్‌గా ప్రకటించే అవకాశాలున్నాయి. వీరితో పాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలకు కూడా కీలకమైన నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టేందుకు నిర్ణయం తీసుకోవాలని అధిష్ఠానాన్ని సీఎం కోరే అవకాశాలున్నాయని సమాచారం.



### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,002 |
| వెండి (గ్రాము): | రూ.254 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,895 |

### విశ్వవాణి



మానవుల్లో మూల కణ చికిత్స ద్వారా టైప్1, టైప్ 2 డయాబెటిస్‌ను చైనా శాస్త్రవేత్తలు నయం చేశారు. ప్రస్తుతం ప్రయోగదశలో ఉన్న ఈ చికిత్సను మరింత ప్రభావవంతంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

## సొంతింటికే పోతా

### నా పార్టీ బీజేపీనే.. ఎమ్మెల్యే రాజాసింగ్



ఈ రోజు కాకపోయినా.. రేపైనా తాను కూడా సొంతింటికి వెళ్తానని, తాను మళ్లీ బీజేపీలో చేరతానని హింట్ ఇచ్చారు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి, ఒక అన్నయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోతే.. ఏదో ఒక రోజు అతను ఇంటికి తిరిగి రావాల్సి ఉంటుందన్నారు.

గోషామహల్, హైదరాబాద్ 26 (ఈవార్తలు): తాను కూడా ఈ రోజు కాకపోయినా రేపైనా తన ఇంటికి తిరిగి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో చెప్పలేనంటూ దాటవేశారు. తాను బీజేపీకి నిజమైన సైనికుడిని అని తెలిపారు. ఢిల్లీ లేదా రాష్ట్ర నాయకులు తనను పిలిచిన రోజున తిరిగి పార్టీలోకి వస్తానని తేల్చి చెప్పారు. ఇంతకు ముందు కూడా తాను ఇదే అభ్యర్థన చేశానని.. ఇప్పుడు కూడా అదే అభ్యర్థన చేస్తున్నానని చెప్పారు. అసెంబ్లీలో స్వేచ్ఛ కల్పించాలని, ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీకి వారి నియోజకవర్గంలో స్వేచ్ఛ ఇవ్వాలని.. అప్పుడే బీజేపీ భవిష్యత్తులో అధికారంలోకి రాగలదని రాజాసింగ్ అన్నారు. ఈరోజు -2 వ పేజీలో...

## సజ్జనార్.. నిఘా!



### న్యూ ఇయర్ వేళ అడుగడుగునా డేగ కన్ను

### ఒంటి గంటకే పబ్బులు, క్లబ్బులు మూయాలి

### లేదంటే వ్యాపార లైసెన్సులు రద్దు చేస్తాం

### హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరికలు

హైదరాబాద్ నగరంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా.. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. నగరంలో 'జీరో డ్రగ్స్' లక్ష్యంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో వేడుకల భద్రతపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈసారి వేడుకల్లో డ్రగ్స్ సరఫరాను అడ్డుకోవడానికి పోలీసులు ముందస్తుగానే వ్యూహాలను సిద్ధం చేశారు. పబ్‌లు, క్లబ్‌లు, భారీ ఈవెంట్లు జరిగే ప్రాంతాల్లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్, నార్కోటిక్ విభాగం నిఘా ఉంచనున్నాయి. కేవలం పబ్‌లే కాకుండా సర్వీస్ అపార్ట్‌మెంట్లు, తరువాయి 2 వ పేజీలో...



2

## జర్నలిస్టుల ఛలో కలెక్టరేట్

### అక్రెడిటేషన్ వివక్షపై ఆందోళన

### నేడు అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతులు

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ, పాత పద్ధతిలోనే డెస్క్ జర్నలిస్టులకూ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలపాలని డెస్క్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (టీజేఎఫ్‌టీ) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఉదయం 10:30 గంటలకు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని జిల్లా కమిటీలకు సూచించింది. ఈ మేరకు శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజేఎఫ్ టీ కమిటీ సమావేశమైంది.

### డెస్క్ జర్నలిస్టులపై వివక్ష

జర్నలిస్టుల మధ్య చిచ్చు..

రెండు కార్డులపై అల్లం నారాయణ ఫైర్



3



### జర్నలిస్టులకు నష్టం లేదు

కొత్త జీవోతో వివక్ష ఉండదు

ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

3

## గీతమ్మా.. రేవంత్‌ను కట్టేయ్!

### ఎవరినైనా కరిచేలా ఉన్నాడు

### ఇష్టారీతిన మొరుగుతున్నాడు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నా అయ్య తెలంగాణ తెచ్చిన మొనగాడు.. అసెంబ్లీకి వస్తే రేవంత్‌కు గుండెపోటే: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): 'కొడంగల్‌లో రేవంత్ రెడ్డి ఇష్టారీతిన మొరుగుతున్నాడని అన్నారు. అమ్మ గీతమ్మా.. రేవంత్ రెడ్డిని కట్టేయ్. లేదంటే ఎవరినన్న కరిచేలా ఉన్నాడు' అని సీఎం రేవంత్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. రెండేళ్లుగా రాష్ట్రంలో కూల్చివేతలు, పేల్చివేతలు, ఎగవేతలు జరుగుతున్నాయని అన్నారు. హైడ్రా పేరుతో కూల్చివేతలు చేస్తున్నారని.. కాళేశ్వరం బ్యారేజ్‌ను చెక్‌డ్యామ్‌లను పేల్చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు ఇసుక అమ్మేందుకు ఉన్న చెక్‌డ్యామ్‌లను బాంబులు పెట్టి పేల్చేస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు దోసల అనిల్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

27.12.2025

మేషం: ఊహించని కలహాలు కలుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. వ్యాపారాలు, ఉద్యోగాలు మందకోడిగా సాగుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. నేత్ర ఉదర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

వృషభం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో పురోగతి సాధిస్తారు. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

మిధునం: వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. కొన్ని పనులు మధ్యలో వాయిదా పడతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆరోగ్య సమస్యలు కొంత చికాకు పరుస్తాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. బంధుమిత్రులతో కొన్ని వ్యవహారాలలో విభేదాలు కలుగుతాయి.

కర్కాటకం: ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఆర్థికంగా కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో అనుకూల వాతావరణం ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

సింహం: సంఘంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. నూతన పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలలో సంతృప్తికరంగా సాగుతాయి.

కన్య: ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆప్తులతో కొన్ని వ్యవహారాలలో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. గృహ నిర్మాణ విషయమై ఆలోచనలు స్థిరంగా ఉండవు. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

తుల: బంధుమిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. కుటుంబ సమస్యలు కొంత చికాకు పరుస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలు మందకోడిగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమౌతుంది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

వృశ్చికం: ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులు సజావుగా పూర్తి చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆప్తులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగమున అధికారులతో చర్చలు సఫలం అవుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు అందుతాయి.

మకరం: కుటుంబ పెద్దల ఆరోగ్యం విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో ఊహించని ఇబ్బందులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఇంటాబయట బాధ్యతలు పెరుగుతాయి.

కుంభం: వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. ముఖ్యమైన పనులు శ్రమతో కానీ పూర్తి కావు. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు.

మీనం: సోదరులతో భూవివాదాలు పరిష్కారమౌతాయి. సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

# జర్నలిస్టుల ఛలో కలెక్టరేట్

## అక్రెడిటేషన్ వివక్షపై ఆందోళన.. నేడు అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు వినతులు

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విధానాన్ని వ్యతిరేకిస్తూ, పాత పద్ధతిలోనే డెస్క్ జర్నలిస్టులకూ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలపాలని డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (టీజేఎఫ్‌టీ) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఉదయం 10:30 గంటలకు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించాలని జిల్లా కమిటీలకు సూచించింది. ఈ మేరకు శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీజేఎఫ్ టీ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాదిని ఉపేందర్, ఎస్కే మస్తాన్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు రెండు రకాల కార్డుల విధానాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులను వేరు చేసేలా ఉన్న జీవో నెంబర్ 252ను వెంటనే సవరించాలని కోరారు. డెస్క్ జర్నలిస్టులకు ఎప్పటిలాగే అక్రిడిటేషన్లు ఇవ్వాలని, అలాగే స్పోర్ట్స్, ఫీచర్స్, సినిమా, వెబ్, కల్చరల్, బిజినెస్ డెస్క్ జర్నలిస్టులతో పాటు కార్టూనిస్టులకు కూడా గతంలో మాదిరిగానే కార్డులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీజేఎఫ్‌టీ కోశాధికారి నిస్సార్, ఉపాధ్యక్షుడు కేవీ రాజారామ్, జాయింట్ సెక్రెటరీ విజయ, తదితరులు పాల్గొన్నారు. కాగా, నిరసన కార్యక్రమాలకు డబ్ల్యూజేఐ, టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే, ఎస్‌జేఏటీ తదితర సంఘాలు మద్దతు ప్రకటించాయి.

### నేడు రౌండ్ టేబుల్ సమావేశం

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మీడియా అక్రెడిటేషన్ల జీవో 252 ను సవరించాలని కోరుతూ శనివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని మామిడి సోమయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ఆగమేఘాల మీద జారీ చేసిన జీవో 252 లో పేర్కొన్న నిబంధనలు అత్యంత ప్రమాదకరంగా, జర్నలిస్టులకు నష్టం కలిగించేలా ఉన్నాయని, జర్నలిస్టులను కూడా విభజించి పాలించే ప్రభుత్వ వైఖరి స్పష్టమవుతుందని మండిపడ్డారు. జర్నలిస్టు అన్న పదానికి అర్థం తెలియని విధంగా ఫీల్డ్ జర్నలిస్టులను, డెస్క్ జర్నలిస్టులను వేరు చేస్తూ జీవో జారీ చేయడం బాధాకరమని అన్నారు. ఈనెల 27న జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో జీవో 252 లోపాలపై చర్చించి ఐక్య కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.



# నీళ్ల కోసం కొట్లాడుడె

మొదటి పేజీ తరువాయి

మరే పార్టీకి నిజమైన పట్టింపు లేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణకు రావాల్సిన నీటి హక్కులు, అభివృద్ధి అవకాశాలను కాపాడుకోవడం బీఆర్ఎస్ బాధ్యత అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని, ప్రజాక్షేత్రంలో వాటిని ఎండగట్టాలని నేతలకు సూచించారు. అవసరమైతే ఉద్యమ మార్గంలోనూ ముందుకు వెళ్లేందుకు పార్టీ సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ఊరుకునే ప్రసక్తే లేదని, ఇకపై దూకుడుగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సుదీర్ఘ విరామం తర్వాత పూర్తిస్థాయి రాజకీయ పోరాటానికి సిద్ధమయ్యారు. ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో తాను అసెంబ్లీకి హాజరవ్వనున్నట్లు పార్టీ శ్రేణులతో చెప్పినట్లు తెలుస్తోంది. తెలంగాణకు రావాల్సిన నదీ జలాల వాటాలో కేంద్రం వివక్షను, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర పొడవునా తెలంగాణకు ద్రోహం చేస్తూనే వచ్చిందని, ఇప్పటి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆయన విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభలు నిర్వహించి.. ప్రజలను చైతన్యపరచాలని పార్టీ శ్రేణులకు ఆదేశాలిచ్చారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనుల్లో జరుగుతున్న జాప్యం, కేంద్రం నుంచి రావాల్సిన అనుమతులపై రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా ఒత్తిడి తీసుకురావడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనిపై ప్రజల్లోకి వెళ్లడం ద్వారా దక్షిణ తెలంగాణలో పార్టీని మళ్ళీ బలోపేతం చేయవచ్చని కేసీఆర్ భావిస్తున్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను బోర్డు పరిధిలోకి తీసుకురావడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయని.. ఈ విషయాన్ని ప్రజలకు బలంగా వివరించాలని ప్లాన్ చేస్తున్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తున్నారన్న వార్త బీఆర్ఎస్ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. గత కొద్దికాలంగా మౌనంగా ఉన్న పార్టీ శ్రేణులు ఇప్పుడు పోరాటాలకు సిద్ధమవుతున్నాయి. అసెంబ్లీ తర్వాత నిర్వహించే సభలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతాయని పార్టీ భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ఈ సభల్లో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది.

# సజ్జనార్ .. నిఘా!

మొదటి పేజీ తరువాయి

ఫాంహౌస్‌లు, హాస్టళ్లలో జరిగే ప్రైవేట్ పార్టీల మీద కూడా నిఘా పెట్టారు. అనుమానం వస్తే సోదాలు చేయడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. గత రెండేళ్లలో డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన వారి కదలికలను నిరంతరం గమనిస్తున్నారు. వారి నుంచి ఎవరికైనా సరఫరా జరిగే అవకాశం ఉందన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. కొత్త ఏడాది వేడుకల సందడిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు సమయ నిబంధనలను ఖరారు చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు కచ్చితంగా రాత్రి ఒంటి గంటకే తమ కార్యకలాపాలను ముగించాలని సీపీ పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని.. అవసరమైతే వారి వ్యాపార లైసెన్సులను రద్దు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్, కేబీఆర్ పార్క్ వంటి రద్దీ ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను కూడా ముమ్మరం చేయనున్నారు. 'వేడుకల పేరుతో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడటమే పోలీసుల ప్రధాన ఉద్దేశం. ఇతర విభాగాల నుంచి కూడా పోలీసులను రప్పించి రద్దీ ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్యంగా మహిళల రక్షణ కోసం 'షీ టీమ్స్' రంగంలోకి దిగుతున్నాయి. నగరం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుంది. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే స్పందించేలా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు కొత్త ఏడాదికి స్వాగతం పలకాలని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తాం' అని సజ్జనార్ స్పష్టం చేశారు.

# సంక్రాంతికి రైతు భరోసా!

మొదటి పేజీ తరువాయి

ఈ పథకం కోసం ప్రభుత్వం రూ. 18,000 కోట్లను కేటాయించింది. జనవరి రెండో వారం నాటికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి.. పండుగ లోపు నిధులు విడుదల చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈసారి రైతు భరోసా అమలులో ప్రభుత్వం కీలక మార్పులు చేస్తోంది. గతంలో సాగు చేయని భూములకు కూడా నిధులు వెళ్తున్నాయనే విమర్శలు ఉండటంతో.. ఈసారి టెక్నాలజీని జోడించింది. రాష్ట్రంలోని వ్యవసాయ భూములను ఉపగ్రహ చిత్రాల ద్వారా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఏ భూమిలో పంట సాగు చేస్తున్నారు.. ఏ భూమి ఖాళీగా ఉంది అనే వివరాలను డిజిటల్ మ్యాపింగ్ ద్వారా సేకరిస్తున్నారు. కేవలం పంటలు సాగు చేసే రైతులకే ఈ పథకం వర్తించేలా నిబంధనలు కఠినతరం చేస్తున్నారు. సాగులో లేని రియల్ ఎస్టేట్ వెంచర్లు, గుట్టలు, ఇతర బంజరు భూములకు ఈ సాయాన్ని నిలిపివేసే అవకాశం ఉంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా.. నిజమైన రైతులకు లబ్ధి చేకూరుతుంది. ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ఈ నిబంధనలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉంది.

# సొంతింటికే పోతా

మొదటి పేజీ తరువాయి

కాకపోయినా రేపైనా తనకు ఢిల్లీ పెద్దల నుండి లేదా రాష్ట్ర పెద్దల నుంచి పిలుపు వస్తుందని కచ్చితంగా తెలుసని చెప్పారు. వారి నుంచి ఫోన్ వస్తే.. తాను ఒకటే ఒక రిక్వెస్ట్ చేస్తానని అన్నారు. తమకు పార్టీ పెద్ద నాయకులు నుంచి స్వేచ్ఛ ఇవ్వండి అని కోరతానని చెప్పారు. అలా స్వేచ్ఛ ఇచ్చిన తర్వాత.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలతో తాము ఏ విధంగా యుద్ధం చేస్తామో అంతా చూస్తారని రాజాసింగ్ పేర్కొన్నారు.

# సంక్రాంతి సెలవులు 9 రోజులు

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పాఠశాలలకు భారీగా సెలవులను ప్రకటించింది. జనవరి 10వ తేదీ నుంచి హాలీడేస్ ప్రారంభం కానున్నాయి. జనవరి 18 ఆదివారంతో సెలవులు ముగియనుండగా.. జనవరి 19 సోమవారం బడులు పునఃప్రారంభం అవుతాయి. గత ఏడాది కేవలం ఆరు రోజులు మాత్రమే సెలవులు ఉండగా.. ఈసారి వరుసగా శని, ఆదివారాలు కలిసి రావడంతో సెలవుల సంఖ్య తొమ్మిదికి పెరిగింది. దీనివల్ల విద్యార్థులు తమ సొంత గ్రామాలకు వెళ్లి పండుగను ఘనంగా జరుపుకునే అవకాశం లభించింది. సంక్రాంతితో పాటు జనవరిలో విద్యార్థులకు మరికొన్ని ముఖ్యమైన సెలవులు కూడా ఉన్నాయి. నూతన సంవత్సర వేడుకలు.. జనవరి 1వ తేదీన కొత్త ఏడాది సందర్భంగా సెలవు ఉంటుంది. జనవరి 26న దేశవ్యాప్తంగా జరుపుకునే గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఇవి కాకుండా నెలలో వచ్చే నాలుగు ఆదివారాలు ఎలాగూ సెలవులే. మొత్తంగా చూస్తే జనవరి నెలలో సగానికి పైగా రోజులు సెలవులతోనే గడిచిపోనున్నాయి.

# గీతమ్మా.. రేవంత్‌ను కట్టేయ్!



మొదటి పేజీ తరువాయి

జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎనుముల రేవంత్ రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఎన్నికలకు ముందు కల్యాణలక్ష్మీ కింద ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తానని సోనియాగాంధీ మీద రేవంత్ రెడ్డి ఒట్టువేశాడని తెలిపారు. మహిళలకు రూ.2500 ఇస్తానని ప్రియాంక గాంధీ మీద ఒట్టు వేశాడని గుర్తుచేశారు. ఇవన్నీ ఎగవేసి.. ఇప్పుడు కోటి మంది మహిళలకు కోటీశ్వర్లను చేస్తానంటున్నాడని మండిపడ్డారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలంటే బడ్జెట్ సరిపోతుందా అని ప్రశ్నించారు. బ్యాగులు మోసి జైలుకెళ్లి.. పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యాడని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ సెటైర్లు వేశారు. ఢిల్లీకి సంచులు మోసి పదవులు కాపాడుకుంటున్నాడని ఆరోపించారు. మహిళలకు ఇస్తానన్న రూ.2500 ఎక్కడపోయాయని అడిగితే నీ గుడ్లు పీకి గోటీలు ఆడుకుంటా అంటున్నాడని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వమంటే నీ లాగుల తొండలు ఇడుస్తా అంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను తిట్టాలనుకుంటే మూడు భాషల్లో పొల్లుపొల్లు తిడతానని స్పష్టం చేశారు. జనవరి 1 నుంచి మహిళలకు రూ.2500 ఇస్తానని శపథం చేయాలని రేవంత్ రెడ్డికి సూచించారు.

### చిట్టినాయుడు.. భీమవరం బుల్లోడు

'నేను గుంటూరులో చదువుకుంటే సీఎం రేవంత్ రెడ్డికి వచ్చిన నొప్పిఏంటి? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు చదువుకున్నా. ఆ తర్వాత పూణె, అమెరికాలో చదవుకున్నా. నేను ప్రపంచమంతా తిరిగి చదువుకున్నా. నీ లెక్క సదువు సంధ్య లేకుండా తిరగలేదు. మీ అమ్మ నాయన నీకు సక్కగ తోవ చూపియ్యకపోతే నా తప్పా? నేనేం చెయ్యాలి? నా మీదేం నీకు నొప్పి. నాకు ఇంగ్లీషు వచ్చు అంటావు. నువ్వు నేర్చుకో. దానికి మీద కూడా ఏడుపేనా? నేను హిందీ నేర్చుకున్నా. ఉర్దూ నేర్చుకున్నా. నువ్వు కూడా నేర్చుకో. నేను గుంటూరులో ఇంటర్ చదువుకున్నా. నీ అల్లుడు ఆంధ్రోడే కదా. ఇక చిట్టినాయుడు కాదు.. భీమవరం బుల్లోడు' అని సీఎంను కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### మా అయ్యపేరు బరాబర్ చెప్పుకుంటా

'మా అయ్య మొగోడు.. తెలంగాణ తెచ్చిన మొనగాడు. మా అయ్య పేరు బరాబర్ చెప్పుకుంటా' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అయ్యపేరు చెప్పుకుని బతికేటోడు అంటూ తనను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను కాకపోతే మా అయ్య పేరు ఇంకెవరు చెప్పుకుంటరు? నీ లెక్క సంచులు మోసుకుంటే నీ పిల్లలు చెప్పుకోరు. రేవంత్ రెడ్డిని కొడంగల్‌లో ఎమ్మెల్యేగా గెలవకుండా చేసే బాధ్యత మాది. రేవంత్ రెడ్డి భాషను చూస్తే పిల్లలు నేర్చుకునే ప్రమాదం ఉంది. కేసీఆర్ ఒక్క ప్రెస్‌మీట్‌కు సీఎం రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయి. రెగ్యులర్‌గా కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డి గుండె ఆగి చస్తాడు' అని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని నిలదీస్తే రేవంత్ రెడ్డికి కోపం వస్తోందని ధ్వజమెత్తారు.

## విద్య, ఉద్యోగవాణి

### డీఆర్‌డీఓలో ఉద్యోగాలు

మొత్తం పోస్టులు: 764
దరఖాస్తు చివరి తేదీ: జనవరి 01, 2026
వయోపరిమితి: 18-28 ఏళ్లు కలవారు
అర్హత: బీఎస్సీ, బీఎల్ఎస్సీ, ఎమ్ఎల్ఎస్సీ, టెన్త్, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి
పరీక్ష విధానం: రాత పరీక్ష
ఎంపిక విధానం: ట్రేడ్ టెస్ట్ ద్వారా

# డెస్క్ జర్నలిస్టులపై వివక్ష

## జర్నలిస్టుల మధ్య చిచ్చు

### రెండు కార్డులపై అల్లం నారాయణ ఫైర్

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): డెస్క్ జర్నలిస్టుల మీద ఎందుకు వివక్ష అని.. రెండు కార్డుల సిద్ధాంతంతో జర్నలిస్టుల నడుమ చిచ్చు పెట్టాలని చూస్తే సహించేది లేదని టీయూడబ్ల్యూజే -143 రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ హెచ్చరించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు కనీస గుర్తింపును కూడా రద్దు చేస్తారా? అని ప్రశ్నించారు. జర్నలిస్టుల హక్కులను కాపాడుకోవడానికి మరో పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. లోపభూయిష్టమైన జీవో 252ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన జీవో 239ను రద్దు చేయడం తెలంగాణ జర్నలిస్టుల హక్కులను కాలరాయడమేనని అన్నారు. డెస్క్ జర్నలిస్టులపై మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి పగబట్టడం అన్యాయమన్నారు. 23 వేల మంది జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇచ్చిన ఘనత గత ప్రభుత్వానిదేనని చెప్పారు. నాడు కల్చరల్ రిపోర్టర్లకు, స్పోర్ట్స్ రిపోర్టర్లకు, ఇలా ప్రతి విభాగానికి విడివిడిగా అక్రిడేషన్లు జారీ చేశామని.. ఇప్పుడు అవన్నీ రద్దు చేయడం దుర్మార్గమన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతిసాగర్, ఉపాధ్యక్షుడు రమేశ్‌హజారి, కోశాధికారి యోగానంద్, తేంజు ప్రధాన కార్యదర్శి రమణకుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గసభ్యులు అవ్వారి భాస్కర్, హైదరాబాద్




జిల్లా ఇన్‌చార్జి నవీన్‌కుమార్, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.మల్లేశ్, సుదర్శన్‌రెడ్డి, కోశాధికారి బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు నష్టం లేదు

## కొత్త జీవోతో వివక్ష ఉండదు

### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన అక్రెడిటేషన్ మార్గదర్శకాలు వృత్తిపరమైన జర్నలిస్టులకు ఎలాంటి నష్టం చేయవని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఎలాంటి వివక్షత లేకుండా సంక్షేమ చర్యలు అందరికీ వర్తించడంతోపాటు ఇంకా మెరుగైన చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి యోచిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ఉర్దూ జర్నలిస్టులపై అనుసరించిన వివక్షతను, చిన్న పత్రికలపై చూపిన చిన్నచూపును, తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన అంశాల నేపథ్యంలో ఈ కొత్త జీవోలో మార్పులు తెచ్చినట్లు వెల్లడించారు. నూతన జీవోపై కొందరు ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలను వెల్లడిస్తున్నారని తెలిపారు. సంక్షేమ చర్యలు విలేకరులకు మాత్రమే వర్తిస్తాయని వక్రీకరిస్తున్నారని.. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. వృత్తిపరమైన జర్నలిస్టులందరికీ ఇవి వర్తిస్తాయని వెల్లడించారు. ఈ విషయాలపై అవసరమైతే వివరణ కోరవచ్చని సూచించారు. జర్నలిస్టులు, వారి సమస్యలపై సీఎం నాయకత్వాన ఉన్న ప్రజాప్రభుత్వం సానుకూల పరిష్కారానికి వెళ్తుంది తప్ప, గత ప్రభుత్వం మాదిరిగా వివక్ష చూపే అవకాశమే లేదని పేర్కొన్నారు.



# లిఫ్ట్ ఇస్తానని నమ్మించి ఐటీ మేనేజర్‌పై గ్యాంగ్ రేప్

### నిందితుల్లో కంపెనీ సీఈవో, మహిళా ఎగ్జిక్యూటివ్

ఉదయ్‌పూర్: కొత్త సంవత్సరం వేడుకల అనంతరం ఇంటికి వెళ్లేందుకు లిఫ్ట్ ఇచ్చిన తోటి ఉద్యోగులే ఒక ప్రైవేట్ ఐటీ కంపెనీ మహిళా మేనేజర్‌పై కదులుతున్న కారులో సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణానికి సంబంధించి కంపెనీ సీఈవో సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో డిసెంబర్ 20న ఒక ప్రైవేట్ హోటల్‌లో కంపెనీ తరఫున న్యూ ఇయర్ పార్టీ నిర్వహించారు. రాత్రి 1:30 గంటలకు పార్టీ ముగిసిన తర్వాత బాధితురాలు ఒంటరిగా మిగిలిపోవడంతో అదే కంపెనీ సీఈవో జయేశ్, మహిళా ఎగ్జిక్యూటివ్ హెడ్ శిల్ప, ఆమె భర్త గౌరవ్ ఆమెను ఇంటి వద్ద దింపుతామని నమ్మబలికారు. బాధితురాలిని కారులో ఎక్కించుకున్నాక దారిలో ధూమపానానికి సంబంధించిన పదార్థాలను కొనుగోలు చేసి ఆమెకు ఇచ్చారు. అది తాగిన కొద్దిసేపటికే బాధితురాలు స్పృహ కోల్పోయింది. ఆ సమయంలో నిందితులు ముగ్గురూ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.ది.

# పిల్లల ముందే భార్య సజీవ దహనం

నల్లకుంట/హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): హైదరాబాద్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త, కన్న పిల్లల కళ్లెదుటే ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించి సజీవ దహనం చేశాడు. అడ్డువచ్చిన కుమార్తెను కూడా నిప్పుల్లోకి తోసి అక్కడి నుంచి పరారయ్యాడు. నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో క్రిస్మస్‌కు ఒక రోజు ముందు, ఈ నెల 24న ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్, త్రివేణి ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా భార్య త్రివేణి ప్రవర్తనపై వెంకటేశ్ అనుమానం పెంచుకుని తరచూ గొడవ పడుతూ, వేధించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 24న పిల్లల ముందే భార్యపై దాడి చేసి, ఆ తర్వాత పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటల్లో కాలిపోతున్న తల్లిని కాపాడేందుకు కుమార్తె ప్రయత్నించగా, ఆమెను కూడా నిప్పుల్లోకి తోసి అక్కడినుంచి పారిపోయాడు. వారి అరుపులు విన్న చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకునేసరికే త్రివేణి తీవ్ర గాయాలతో మృతి చెందింది. స్వల్ప గాయాలతో బయటపడిన కుమార్తెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



# సీక్రెట్‌గా మొబైల్ వాడుతోందని..

### భార్యను చంపి.. పెరట్లో పాతిపెట్టిన భర్త

లక్నో: భార్య రహస్యంగా మొబైల్ ఫోన్ వాడుతోందన్న కోపంతో ఓ భర్త ఆమెను దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఇంటి వెనుకే గొయ్యి తీసి పూడ్చిపెట్టి, ఆమె ఆత్మహత్య చేసుకుందని పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. ఈ దారుణ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లూథియానాలో కూలీగా పనిచేసే అర్జున్, ఈ నెల 21న గోరఖ్‌పూర్‌లోని తన ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో అతని భార్య ఖుష్బూ రహస్యంగా మొబైల్ ఫోన్ వాడటాన్ని గమనించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన అర్జున్, ఖుష్బూ గొంతు నులిమి హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి వెనుక ఆరడుగుల గొయ్యి తవ్వి, ఓ మడత మంచం సహా ఆమె మృతదేహాన్ని అందులో పూడ్చిపెట్టాడు. ఖుష్బూ తండ్రి తన అల్లుడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది.

# ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విడుదల

**రెండు వారాల పాటు ప్రశ్నించిన సిట్ అధికారులు.. జనవరి 16న సుప్రీంకు విచారణ నివేదిక!**

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శుక్రవారం విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెండు వారాల పాటు కస్టడీలో విచారించిన అనంతరం, గడువు ముగియడంతో జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ నుంచి ఆయనను విడిచిపెట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈనెల 12న సిట్ ఎదుట లొంగిపోయిన ప్రభాకర్ రావును అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఆయన విచారణకు సహకరించడం లేదని భావించి కస్టడీని పొడిగించారు. పదవీ విరమణ తర్వాత కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయన్ను ఎస్ఐబీ చీఫ్‌గా ఎందుకు నియమించిందనే కోణంలో సిట్ ప్రశ్నించినట్లు సమాచారం. దీని వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని దర్యాప్తు సంస్థ



అనుమానిస్తోంది. మాజీ మంత్రి హరీశ్ రావుతో తరచూ ఎందుకు భేటీ అయ్యారని ప్రశ్నించగా, మావోయిస్టుల ముప్పు గురించి వివరించడానికేనని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసులో భాగంగా మాజీ డీఎస్పీ ప్రణీత్ రావుతో కలిపి ప్రభాకర్ రావును విచారించారు. దీంతో పాటు మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ వంటి ఉన్నతాధికారుల వాంగ్మూలాలను కూడా సిట్ నమోదు చేసింది. ప్రభాకర్ రావు కస్టడీ విచారణపై జనవరి 16న సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక సమర్పించనుంది. మరోవైపు ఈ కేసులో తదుపరి చర్యలపై ఇంటెలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ సమావేశమై చర్చించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులను కూడా విచారణకు పిలిచే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

# గరుబత్తులలో సువాసనల వాడకం నిషేధం

### బీఐఎస్ కొత్త ప్రమాణాలు విడుదల

న్యూఢిల్లీ: దేశంలో అగరుబత్తీల (ధూప్ స్టిక్స్) నాణ్యత, భద్రతను పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కొత్త ప్రమాణాలను విడుదల చేసింది. 'జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025' సందర్భంగా శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి "ఐఎస్ 19412:2025 %-% అగరుబత్తీల స్పెసిఫికేషన్" పేరుతో ఈ నూతన ప్రమాణాలను ఆవిష్కరించారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, అగరుబత్తీల తయారీలో పలు హానికరమైన పురుగుమందులు, సింథటిక్ సువాసనల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. అలత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి పురుగుమందులతో పాటు బెంజైల్ సైనైడ్, ఇథైల్ అక్రిలేట్ వంటి రసాయనాల వాడకంపై ఆంక్షలు



విధించారు. వీటిలో చాలా రసాయనాలు మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంతర్జాతీయంగా నిషేధంలో ఉన్నాయి. ప్రపంచంలోనే అగరుబత్తీల ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో ఏటా రూ. 8,000 కోట్ల పరిశ్రమ ఉండగా, సుమారు 150 దేశాలకు రూ. 1,200 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఈ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని ఎందరో చేతివృత్తుల వారికి, మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. కొత్త ప్రమాణాల ప్రకారం అగరుబత్తీలను యంత్ర నిర్మిత, చేతితో తయారు చేసినవి, సాంప్రదాయ మసాలా రకాలుగా వర్గీకరించారు. ముడిసరుకులు, మండే విధానం, సువాసన వంటి అంశాల్లో నాణ్యతను నిర్దేశించారు. ఈ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఉత్పత్తులకు 'బీఐఎస్ స్టాండర్డ్ మార్క్' లభిస్తుంది. దీనివల్ల వినియోగదారులు నాణ్యమైన, సురక్షితమైన ఉత్పత్తులను సులభంగా గుర్తించవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వినియోగదారుల నమ్మకాన్ని పెంచడంతో పాటు, భారత అగరుబత్తీలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత ఆదరణ లభిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.



# నంద్యాలలో హైదరాబాదీలు దుర్మరణం

### కారు, ప్రైవేట్ బస్సు ఢీకొని నలుగురి మృతి

నంద్యాల/హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల, బత్తలూరు గ్రామాల మధ్య 40వ నంబరు జాతీయ రహదారిపై ఈ విషాదం చోటుచేసుకుంది. మృతులంతా హైదరాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆరుగురు ప్రయాణిస్తున్న ఓ కారు తిరుపతి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో, కారు ఆళ్లగడ్డ సమీపంలోకి రాగానే డ్రైవర్ అదుపు కోల్పోయాడు. దీంతో కారు వేగంగా రోడ్డు డివైడర్‌ను దాటి, ఎదురుగా హైదరాబాద్ నుంచి పుదుచ్చేరికి వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికులు, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను, క్షతగాత్రులను అతికష్టం మీద బయటకు తీశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని, వారిని మరో వాహనంలో గమ్యస్థానాలకు పంపించామని అధికారులు తెలిపారు. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండటమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

# ఆరా మస్తాన్.. ఔర్ ఏక్ బార్

### ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోసారి విచారణ

హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో కీలక సాక్షిగా ఉన్న ఆరా మస్తాన్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి విచారించింది. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ విచారణలో సిట్ అధికారులు మస్తాన్ రెండో స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. దీంతో కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుంటోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన ఆరా మస్తాన్.. గతంలో తాను వెల్లడించిన అంశాలనే సిట్ అధికారులు మరోసారి స్పష్టంగా అడిగారని తెలిపారు. తనకు తెలిసిన ప్రతీ విషయం ఎలాంటి మార్పులు లేకుండా స్పష్టంగా చెప్పానన్నారు. ముఖ్యంగా ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్‌రావు ఇచ్చిన వాంగ్మూలాన్ని క్రాస్ చెక్ చేసుకునేందుకే తనను మరోసారి పిలిపించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సిట్ అధికారులు తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన డేటాను తన ముందే ఉంచారని మస్తాన్ చెప్పారు. ఆ డేటా ప్రకారం 2020 నుంచే తన రెండు ఫోన్లు ట్యాప్ అయ్యాయని అధికారులు వివరించినట్లు తెలిపారు. దీనితో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎంత లోతుగా, పద్ధతిగా జరిగిందన్న విషయం స్పష్టమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఈ కేసులో సిట్ ఉన్నత స్థాయి అధికారులతో దర్యాప్తు చేపడుతోందని, ముఖ్యమైన సాక్షులందరినీ విచారిస్తున్నట్లు మస్తాన్ తెలిపారు. అందువల్లే దర్యాప్తు ముగింపు దశకు చేరుకుందని ఆయన అభిప్రాయపడ్డారు. అవసరమైతే మరోసారి విచారణకు పిలిచే అవకాశముందని, వారం రోజుల్లో మళ్లీ నోటీసులు రావచ్చని కూడా సూచించారు. మొత్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసు త్వరలోనే ఒక తుది నిర్ణయానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆరా మస్తాన్ వ్యాఖ్యానించారు.

# గలీజ్ రాజకీయాలు చేస్తుండ్రు


### కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపాటు

కరీంనగర్, డిసెంబర్ 26 (ఈవార్తలు): తెలంగాణలో అభివృద్ధి పూర్తిగా పక్కదారి పట్టిందని, అధికార, ప్రతిపక్ష పార్టీలు కేవలం బూతులు తిట్టుకోవడానికే పరిమితమయ్యాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి, జవాబుదారీతనం అనేవే లేకుండా పోయాయని, కేవలం వ్యక్తిగత దూషణలు తప్ప మరేమీ లేవని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. 'సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజా సమస్యలను గాలికొదిలేసి, అసభ్య పదజాలంతో పరస్పరం దూషించుకుంటున్నారు. పాలనలో చూపించడానికి ఏమీ లేనప్పుడే నాయకులు ఇలాంటి వ్యక్తిగత విమర్శలకు దిగుతారు. భాష గురించి నీతులు చెప్పే పార్టీలే ఇప్పుడు రాజ్యాంగ వేదికల నుంచి బూతులు మాట్లాడుతున్నాయి' అని అన్నారు. ప్రజలు సుపరిపాలన కోసం ఓటు వేస్తే, 2014 నుంచి రాష్ట్రంలో గలీజ్ రాజకీయాలు తప్ప మరేమీ చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏసీలో మంటలు.. రెండేళ్ల బాలుడు మృతి

కాచిగూడ/హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని కాచిగూడలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. ఏసీలో మంటలు చెలరేగడంతో రెండేళ్ల బాలుడు మృతి చెందాడు. కాచిగూడ పరిధిలోని సుందర్ నగర్‌లో ఓ ఇంట్లో శుక్రవారం సాయంత్రం ఏసీ నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. ఆ సమయంలో రెండేళ్ల బాలుడు గదిలో ఉన్నాడు. మంటల కారణంగా తీవ్ర గాయాలపాలైన బాలుడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా, ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ జరగడమే కారణమని భావిస్తున్నారు.

# సోషల్ వాణి



## మార్కెట్‌కి వెళ్లి కూరగాయలు తెచ్చినోళ్లను గుర్తించినవ్.

మరి.. వంట చేసినోడు ఎక్కడికి పోవాలె పటేలా.?

వండి.. వార్చి.. వడ్డించోడి శ్రమ ఉత్తదేనా.?

తాజా.. వేడి వేడి వార్తలు.. కమ్మని కథనాలు వచ్చేది ఆ వంటవాడి చేతి మహిమతోనే కదా.?

మరి ఏమైంది మీడియా అకాడమీకి.?

జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులంటే గుర్తింపు కార్డులే కదా.? వాటినిచ్చేందుకు ఆపసోపాలెందుకు సామీ.?

ఒకరికి అక్రిడేషన్ కార్డేంది.? ఇంకొకరికి మీడియా కార్డేంది.?

నేను గత 15 ఏళ్ల నుంచి ఫీచర్ రిపోర్టర్‌గానే పనిచేస్తున్నా. నేను రాసే వార్త.. కథనం.. నేనే సేకరించాలి. నేనే రాసుకోవాలి. నేనే ఎడిట్ చేసుకోవాలి. ముఖ్యమైన ప్రెస్‌మీట్లు.. కార్యక్రమాలు.. సమావేశాలు.. సమీక్షలకు కూడా హాజరుకావాల్సి ఉంటుంది.

జనరల్ రిపోర్టర్ ఆ సమావేశం తాలూకు స్పాట్ వార్తను రాస్తే.. నేను ఆ వార్త వెనక ఉన్న కథనాన్ని అధ్యయనం చేసి.. విశ్లేషించి వివరణాత్మకంగా ఆసక్తి కలిగించేలా.. ఆలోచింపజేసేలా రాయాలి. అంటే సదరు స్పాట్ వార్త కవర్ చేసే రిపోర్టర్‌తో పాటు ఫీచర్ రిపోర్టర్ కూడా వెళ్లాల్సిందే కదా.?

మరి అలాంటప్పుడు నేను అక్రిడేషన్ కార్డు దారున్నా.? లేక మీడియా కార్డు దారున్నా.? అనేది మీడియా అకాడమీ పెద్దలు చెప్పాలి.

అంటే..

ఇక్కడ మార్కెట్‌కి వెళ్లేది.. కూరగాయలు తెచ్చేది.. ఘుమఘుమలాడేటట్లు వండి వడ్డించేది కూడా నేనే కదా.? ఇలాంటప్పుడు ఫీచర్స్ రిపోర్టర్‌కి అక్రిడేషన్ కార్డు.. మీడియా కార్డు రెండూ ఇస్తారా.?

అసలు మునుపెన్నడూ లేని విధంగా ఈ కార్డులను తక్కెట్లో వేసి జోకుడేంది.? నీకు పది.. నీకు పదిహేను అని ఫలారం పంచుడేంది.?

అక్రిడేషన్ కార్డులను మీ ఇంట్లకెల్లి ఇస్తున్నారా.? లేదా పుణ్యానికి వేస్తున్నారా.? బిచ్చమేస్తున్నారా.?

ఎందుకు ఈ జోకుడు.. తూకమేసుడు.?

ఏం చేసుకుంటాం మేం వాటితో.? ఏమైనా కోట్లు కోట్లు వెనకేసుకొని ప్రభుత్వ ఖజానాకు గండి కొడతామా.? సర్కారు సొమ్ము ఎత్తుకుపోతమా.?

ఏదో పాపం.. బతకలేక.. సావలేక చేస్తున్న ఈ జర్నలిస్టు ఉద్యోగంతో ఏవైనా రోగాలు.. నొప్పులు వస్తే ఏ సర్కారు దవఖాన్లో ఏదో చిన్నపాటి వైద్యం చేసుకుంటం అంతే కదా.? లేదా ఆర్టీసీ బస్సులో రాయితీతో ప్రయాణం చేస్తం అంతే కదా.?

ఆడవాళ్లకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తే రాని నష్టం.. మాకు అక్రిడేషన్ కార్డులిస్తేనే వస్తుందా.? ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యం అందిస్తే రాని నష్టం జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులిస్తేనే వస్తుందా.?

అసలెంతమందిమి ఉన్నారనుకుంటున్నారు జర్నలిస్టులు.? వారి జీతాలెంతున్నాయనుకుంటున్నారు.?

అయ్యా సారూ.. మేమేం లచ్చలు సంపాదించి బంగళాలు కార్లు కొనుక్కునే స్థాయిలో లేము. పేరు పెద్దది మాది. కానీ ఉండీ లేక వెళ్లదీస్తున్న జీవితాలే. మీకు తెలియని విషయం ఏందంటే ఈ ఫీల్డులోకి వచ్చినొళ్లు మధ్యంతరంగా వదిలేసి ఇంకో వేరే పని చేయలేరు. ఉన్నన్నాళ్లు జర్నలిస్టుగానే నాలుగు అక్షరాలు రాసుకొని బతికే జీవితాలు. మీరనుకుంటున్నట్లు ఏదో కొద్దిమంది మాత్రమే అక్రిడేషన్లను.. హోదాలను ఉపయోగించి బాగా సంపాదించి ఉంటారు. అందరూ అలాగే ఉండరు నాయనా.

మా ఖర్చులు.. మా ఈఎంఐలు.. మా కార్డుల బిల్లులు.. స్కూళ్ల ఫీజులు ఎన్నో.. మాకున్న తొర్రలెన్నో ఒకసారి వచ్చి చూసుకోండి.

అప్పుడైనా డిసైడ్ అవండి ఈ అక్రిడేషన్ కార్డులేందీ.. మీడియా కార్డులేందీ అనే ముచ్చట అర్థమైతుంది.

కార్డులు ఏవిచ్చినా జర జోకకండి దొరా. వాటితో సర్కారుకొచ్చే సమస్యేముండదు. మాకు కేటాయించే కోట్లేమీ ఉండవు. మమ్మిల్ని విభజించి.. విభజన రేఖలు గీయకండి. అందరికీ అక్రిడేషన్ కార్డులు ఇయ్యండి. అంతేగానీ.. మాకు కార్డులిస్తే భూకంపం ఏదో వస్తుందని భయపడకండి.

మేం భూకంప సమాచారాన్ని చేరవేసేవాళ్లమేగానీ.. భూకంపాలు సృష్టించేవాళ్లం కాదు. మా కార్డులతో మీకొచ్చే నష్టం.. వ్యవస్థకొచ్చే ప్రమాదమేమీ లేదు.

**పాజిటివ్‌గా ఆలోచించండీ.. పరేషాన్ అవకండీ.**

ఆవేదనతో ఒక జర్నలిస్టు.. - దాయి శ్రీశైలం



## జగిత్యాల ధన్వంతరి ఆలయంలో కుంకుమార్చన

జగిత్యాల టౌన్, డిసెంబర్ 26 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ చింతకుంటలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శుక్రవారం కుంకుమపూజలు నిర్వహించారు. లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం, అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్కీ డిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి అమ్మవారి శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వొడ్నాల శ్రీనివాస్, భారతాల రాజసాగర్, మహిళా సమితి సభ్యులు వొడ్నాల లత, భారతల గీత, త్రివేణి, కృష్ణవేణి, సుమలత, హర్షిని, యశోద, వాణి, రుచిత, నీరజ, ఉషా రాణి, సన్నిహిత, వాణి, అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## భారీ గుంత.. చూడకపోతే అంతే!

మల్యాల, డిసెంబర్ 26 (ఈవార్తలు): మండల కేంద్రంలోని 11వ వార్డులోని తడక రామచంద్రం ఇంటి ముందు సీసీ రోడ్డుపై ప్రమాదకరంగా భారీ గుంత ఏర్పడింది. జగ్గాని ఒర్రెను అనుకొని సీసీ రోడ్డు మధ్యలో భారీ గుంత ఉండడంతో దారిగుండా వెళ్లే స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అటుగా వెళుతున్న సామాజికవేత్త దొంతరవేణి శేఖర్ ఆ గుంతపై బండరాయి ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని కోరారు.



## కొండగట్టు ఘాట్‌రోడ్డులో ఆటో బోల్తా

మల్యాల, డిసెంబర్ 26 (ఈవార్తలు): కొండగట్టు ఘాట్ రోడ్డుపై ఆటో బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకొని తిరుగు ప్రయాణంలో ఘాట్ రోడ్ నుండి కిందకి దిగుతున్న క్రమంలో ఆటో బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి బోల్తా పడడంతో నలుగురికి (4) కి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని స్థానికులు అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటోలోని ప్రయాణికులు గోదావరిఖని వాసులు (ఒకే కుటుంబం)గా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. అయితే, డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగినట్లు తెలిసింది.



## అవతార్ కన్నా మహాభారతం, రామాయణం గొప్పవి

**పిల్లలకు ఈ విషయాలు చెప్పాలి : ఏపీ సీఎం చంద్రబాబు**

తిరుపతి, డిసెంబర్ 26 (ఈవార్తలు): స్పైడర్ మ్యాన్, ఐరన్ మ్యాన్ వంటి కాల్పనిక పాత్రల కన్నా హనుమంతుడు, అర్జునుడు వంటి మన పురాణ పురుషులే గొప్పవారని పిల్లలకు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అవతార్ సినిమా కంటే మన మహాభారతం, రామాయణం చాలా గొప్పవని పిల్లలకు చెప్పాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని, సూపర్ పవర్‌గా అవతరించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తిరుపతిలో శుక్రవారం జరిగిన 'భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్' ప్రారంభ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "వేల ఏళ్ల క్రితమే హరప్పా నాగరికత ద్వారా అర్బన్ ప్లానింగ్‌ను ప్రపంచానికి పరిచయం చేశామని, యోగా, ఆయుర్వేదం వంటి శాస్త్రాలను అందించామని గుర్తుచేశారు. తక్షశిల, నలంద వంటి విశ్వవిద్యాలయాలతో పాటు, సున్నాను, చదరంగాన్ని కనిపెట్టిన ఘనత మనదే. ఆర్యభట్ట, భాస్కరాచార్య, కౌటిల్యుడు వంటి మహానుభావులు మనకు స్ఫూర్తి" అని అన్నారు. రెండు వేల ఏళ్ల క్రితమే ప్రపంచ జీడీపీలో 40 శాతం వాటాతో భారత్ నాలెడ్జ్ ఎకానమీలో సూపర్ పవర్‌గా ఉండేదని, విదేశీ పాలన, కొన్ని విధానాల వల్ల వెనుకబడ్డామని తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, దేశాభివృద్ధికి ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేస్తున్న కృషి శ్లాఘనీయమని కొనియాడారు. "తిరుగులేని యువశక్తి మన దేశం సొంతం. ఇదే మనల్ని అగ్రస్థానంలో నిలుపుతుంది. దేశాభివృద్ధికి వాజ్‌పేయి పునాదులు వేస్తే, ప్రధాని నరేంద్ర మోదీ అద్భుతంగా ముందుకు తీసుకెళుతున్నారు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## అమెరికా దృష్టికి హెచ్-1బీ అంశం: భారత్

న్యూఢిల్లీ: అమెరికా హెచ్-1బీ వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఈ విషయాన్ని తాము అమెరికా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆయన వెల్లడించారు. ఇది అమెరికా సార్వభౌమాధికార పరిధిలోని అంశమే అయినప్పటికీ, తమ ఆందోళనలను అమెరికాకు తెలియజేశామని ఆయన పేర్కొన్నారు. కెనడాలో గుండెపోటు కారణంగా భారత సంతతికి చెందిన వ్యక్తి ఇటీవల మరణించిన ఘటనపై కూడా భారత్ స్పందించింది. మృతుడు భారత సంతతికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, అతనికి కెనడా పౌరసత్వం ఉందని స్పష్టం చేసింది. ఈ విషయంలో కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొంది.

# ఢిల్లీ హైకోర్టులో పవన్‌కు ఊరట

**వ్యక్తిగత హక్కులకు రక్షణ.. పేరు, ఫొటో వాణిజ్యపరంగా వాడొద్దని ఆదేశం**



న్యూఢిల్లీ: టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, చిత్రం, గొంతు, వ్యక్తిగత గుర్తింపులను ఎలాంటి అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకుండా పలు ఆన్‌లైన్ సంస్థలు, ఏఐ ప్లాట్‌ఫామ్‌లు, వెబ్‌సైట్లపై మధ్యంతర ఉత్తర్వులు (యాడ్-ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసింది. తన వ్యక్తిగత, ప్రచార హక్కులకు (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) భంగం కలుగుతోందని ఆరోపిస్తూ పవన్ కల్యాణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ ఎక్స్‌పార్టీ ఆదేశాలు ఇచ్చింది. మూడు దశాబ్దాలుగా సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న పవన్ కల్యాణ్‌కు గణనీయమైన వాణిజ్య బ్రాండ్ విలువ ఉందని, ఆయన వ్యక్తిగత హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. పలు సంస్థలు పవన్ కల్యాణ్ అనుమతి లేకుండా ఆయన ఫొటోలతో టీ-షర్టులు, కప్పులు, పోస్టర్లు వంటివి అమ్ముతున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా ఆయన గొంతు, ఫొటోలను వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ పేజీలు నిర్వహిస్తున్నారని పవన్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల పవన్‌కు పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈ-కామర్స్ వేదికల నుంచి అలాంటి ఉత్పత్తులను తక్షణమే ఆదేశించింది. వాటిని అమ్ముతున్న విక్రయదారుల కేవైసీ వివరాలను పిటిషనర్‌కు అందించాలని సూచించింది. పవన్ పేరును దుర్వినియోగం చేస్తున్న వెబ్‌సైట్ లింకులను వారం రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. అయితే, ఫ్యాన్ పేజీలకు మాత్రం కొన్ని షరతులతో మినహాయింపు ఇచ్చింది. అవి 'ఫ్యాన్ పేజీ' అని స్పష్టమైన డిస్‌క్లెయిమర్ ఇవ్వాలని, లేనిపక్షంలో వాటిని కూడా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

# అన్‌ఫిట్ ఉద్యోగులకు ప్రత్యామ్నాయం

**ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ సర్కారు గుడ్ న్యూస్**




విజయవాడ, డిసెంబర్ 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ)లో పనిచేస్తూ వైద్యపరమైన కారణాలతో అనర్హులుగా (మెడికల్ అన్‌ఫిట్) తేలిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. అలాంటి వారికి ఇతర ప్రభుత్వ శాఖల్లో ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత, అంటే 2020 జనవరి 1 నుంచి మెడికల్ అన్‌ఫిట్‌గా నిర్ధారణ అయిన ఉద్యోగులందరికీ ఈ నిర్ణయం వర్తిస్తుంది. అనారోగ్య కారణాలతో ఉపాధి కోల్పోయిన అనేక మంది ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఈ ఉత్తర్వుల వల్ల గణనీయమైన భరోసా లభించనుంది. గతంలో ఆర్టీసీలో ఉండగా మెడికల్ అన్‌ఫిట్‌గా తేలితే ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చేది. అయితే, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన నేపథ్యంలో, వారిని కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, వారి అర్హతలకు అనుగుణంగా ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ తాజా చర్యతో బాధిత ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ భద్రత లభించనుంది. ఈ నిర్ణయంపై ఆర్టీసీ ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. దీనిపై ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించారు. ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి ప్రభుత్వ సేవల్లోకి జనవరి 2020 లో విలీనం అయిన ఉద్యోగులు, వైద్యపరంగా విధులకు అనర్హులుగా ప్రకటించబడిన ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిశీలించి తగిన చర్యలు ప్రారంభించిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వికలాంగుల హక్కుల చట్టం%-%2016 ప్రకారం అర్హత కలిగిన ఉద్యోగులకు ప్రాధాన్యత క్రమంలో ప్రత్యామ్నాయ ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. అవసరమైన మేరకు జిల్లా కలెక్టర్ల సహకారంతో ఇతర ప్రభుత్వ శాఖల్లో కూడా ప్రత్యామ్నాయ ఉద్యోగాల్లో నియామక అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేస్తుందని వివరించారు.

# బీటెక్ యువతి గంజాయి రవాణా

**అనకాపల్లి జిల్లాలో ముఠా అరెస్ట్**



అనకాపల్లి, డిసెంబర్ 26 (ఈవార్తలు): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి గంజాయి రవాణా చేస్తున్న ఓ బీటెక్ యువతితో పాటు ఏడుగురు సభ్యుల ముఠాను అనకాపల్లి జిల్లా నాతవరం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 74 కిలోల గంజాయి, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం మీడియాకు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ సుమారు రూ. 33 లక్షలు ఉంటుందని ఆయన వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా మాడుగులపేటకు చెందిన గాది రేణుక బీటెక్ చదివి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసింది. అయితే, ఆ ఉద్యోగం మానేసి సులభంగా డబ్బు సంపాదించేందుకు గంజాయి రవాణా మార్గాన్ని ఎంచుకుంది. ఈ క్రమంలో తమిళనాడుకు చెందిన సూర్య కాళిదాసు మదన్ కుమార్, ముత్తుతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన పద్దూరి ప్రసాద్, అండెంగుల రవికుమార్, లలిత కుమారి, పొన్నగంటి మణికుమారితో కలిసి ఓ ముఠాగా ఏర్పడింది. నిందితులు గంజాయిని తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో నాతవరం పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఈ కేసుపై నాతవరం ఎస్సై తారకేశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతోంది.



# పంతంగి వద్ద భారీగా ట్రాఫిక్

**క్రిస్మస్ ముగియడంతో హైదరాబాద్ వైపు భారీగా వాహనాలు**

**టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్**

పంతంగి, డిసెంబర్ 26 (ఈవార్తలు): వరుసగా వచ్చిన క్రిస్మస్ సెలవులు ముగియడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి భారీ ట్రాఫిక్‌తో నిండిపోయింది. క్రిస్మస్ అనంతరం ఆఫీసులు, కాలేజీలు, పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఒకేసారి లక్షలాది మంది హైదరాబాద్ వైపు ప్రయాణం చేయడంతో రహదారిపై వాహనాల ఒత్తిడి విపరీతంగా పెరిగింది. ప్రత్యేకంగా పంతంగి, చౌటుప్పల్, కోర్లపాడు టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. నేషనల్ హైవే 65పై ఔటర్ రింగ్ రోడ్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్ వరకు ట్రాఫిక్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు కదలని పరిస్థితి నెలకొంది. ఇక ఆరు లేన్ల రోడ్డు విస్తరణ పనులు కూడా ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణంగా మారాయి. చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, పంతంగి ప్రాంతాల్లో బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణం కొనసాగుతుండటంతో రోడ్డు సామర్థ్యం గణనీయంగా తగ్గింది. దీంతో వాహనాలు నెమ్మదిగా కదులుతుండగా, ట్రాఫిక్ జామ్‌లు మరింత తీవ్రతరం అవుతున్నాయి.

## నేడు హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడిగా భూరం శంకర్ నామినేషన్



హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టు బార్ కౌన్సిల్ ఎన్నికలు జనవరి 30న జరుగనున్నాయి. ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఈ నేపథ్యంలో బార్ కౌన్సిల్ సభ్యునిగా తన మద్దతుదారులతో కలిసి శనివారం హైకోర్టు బార్ కౌన్సిల్ కార్యదర్శి కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు హైకోర్టు అడ్వొకేట్ భూరం శంకర్ తెలిపారు. భూరం శంకర్ గత ఎన్నికలలో బార్ కౌన్సిల్ సభ్యునిగా పోటీ చేసి విజయం సాధించారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, అడ్వకేట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శిగా, అధ్యక్షుడిగా న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేశారు.

## మాగంటి సునీతకు జన్మదిన శుభాకాంక్షలు

**బీఆర్ఎస్ నేత నవీన్ పటేల్ ఆధ్వర్యంలో వేడుకలు**



జూబ్లీహిల్స్/హైదరాబాద్, డిసెంబర్ 26 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మాగంటి సునీత గోపీనాథ్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నేత నవీన్ పటేల్ ఆమె జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో సునీత జన్మదిన వేడుకలు నిర్వహించారు. పేద ప్రజలు, చిన్నారులకు అన్నదానం చేసి మాగంటి కుటుంబానికి తన విజ్ఞత చాటుకున్నారు.



## సర్పంచ్‌కు బీడీ టేకేదార్ల సన్మానం

మల్యాల, డిసెంబర్ 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గెలిచిన బొట్ల జయ ప్రసాద్, ఉపసర్పంచ్ కట్కం వినయ్‌కు బీడీ టేకేదార్లు ఘనంగా సన్మానం చేశారు. శుక్రవారం మల్యాలలోని టెలిఫోన్ బీడీ కంపెనీలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో టేకేదార్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు క్యాస మల్లారెడ్డి, క్యాషియర్ బొమ్మకంటి గంగాధర్, మల్యాల మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, టేకేదార్ సభ్యులు మ్యాన సంతోష్, మిట్టపల్లి వెంకటరమణ, ఎండీ రఫీ, గాజుల అనిల్, కట్ల రాజేందర్, పెంట నారాయణ, వీరబత్తిని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యం కేసులో నిందితుల విచారణ

అమరావతి, డిసెంబర్ 26 (ఈవార్తలు): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసు దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ కేసులోని ఐదుగురు ప్రధాన నిందితులను మూడు రోజుల కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లి కోర్టు అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో ఎక్సైజ్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ కేసులో ఏడుగురు నిందితులను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఐదుగురు నిందితులను మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మదనపల్లె సబ్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న ఏ1 అద్దేపల్లి జనార్దన్ రావు, ఏ26 జగన్మోహన్ రావు, ఏ28 తాండ్ర రమేశ్, ఏ27 తిరుమలశెట్టి శ్రీనివాసరావు, ఏ29 షేక్ అల్లబక్షులను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. కస్టడీకి తీసుకున్న వెంటనే నిందితులకు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత వారిని విచారణ నిమిత్తం మదనపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించనున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు వీరిని ప్రశ్నించి కీలక సమాచారం రాబట్టే అవకాశం ఉంది. ఈ విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి రావచ్చని అధికారులు భావిస్తున్నారు.

## ఆలయంలో ప్రదర్శనకు వచ్చి యువ కళాకారిణి మృతి

రాజోలు, డిసెంబర్ 26 (ఈవార్తలు): పండుగ ఉత్సవాలలో నృత్య ప్రదర్శన ఇవ్వడానికి వచ్చిన ఒక యువ కళాకారిణి మెట్లపై నుంచి జారిపడి మృతి చెందింది. కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటిలో జరిగిందీ ఘటన. స్థానిక కుంతలేశ్వరి అమ్మవారి తీర్థ మహోత్సవాల ప్రారంభానికి వచ్చిన నాట్య బృందంలోని 17 ఏళ్ల బాలిక పాలపర్తి భవ్యశ్రీ ప్రమాదవశాత్తు పైఅంతస్తు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోయింది. రాజమహేంద్రవరం నుంచి 12 మంది కళాకారులతో కూడిన బృందం నిన్న తెల్లవారుజామున శివకోటి చేరుకుంది. ఆలయానికి ఎదురుగా ఉన్న మండపంలో వారికి వసతి ఏర్పాటు చేశారు. ప్రదర్శనకు సిద్ధమైన భవ్యశ్రీ, పై అంతస్తులోని గది నుంచి మెట్లు దిగుతూ వస్తుండగా కాలు జారి కిందపడింది. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. భవ్యశ్రీ వేసుకున్న ఎత్తైన పాదరక్షల కారణంగానే ఆమె పట్టు కోల్పోయినట్టు తోటి కళాకారులు చెబుతున్నారు. అయితే, ఆ మెట్లకు కనీస రక్షణ గోడ కూడా లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని ఆమె సోదరి పాలపర్తి మధు ఆరోపించారు. ఈ బృందంలో మృతురాలితోపాటు దాదాపు అందరూ మైనర్లే కావడం గమనార్హం.



# ఢిల్లీ పొగ భయపెడుతోంది

**సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన**

పనాజీ: ఢిల్లీలో వాయు కాలుష్య తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. ఢిల్లీ వాయు కాలుష్యంపై వివిధ సంస్థలు, రాజకీయ నాయకులతో పాటు సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పందించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అయితే సంబంధిత సంస్థలు దీనికి పరిష్కారం కనుగొంటాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ రాజధానిని పీడిస్తున్న ఈ సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ప్రయోజనాలు కలిగించే విధానాల కంటే దీర్ఘకాలిక పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. గోవాలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన జస్టిస్ సూర్యకాంత్ మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీ వాయు కాలుష్యంపై పర్యావరణ సంస్థలు, నిపుణులు సమర్థవంతంగా పరిష్కారం కనుగొంటారని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో పెరుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం హానికర పొగమంచు ఢిల్లీలోని అనేక ప్రాంతాలను కమ్మేసింది. దీంతో దృశ్య నాణ్యత కూడా బాగా పడిపోయింది. వాయు కాలుష్యం తీవ్రంగా ఉండటంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్-4 కింద ఆంక్షల అమలును కొనసాగిస్తున్నారు. ఢిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) గురువారం ఉదయం 220గా నమోదైంది. ఓ సమయంలో 310గా కూడా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది.



## పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

**కేంద్రానికి మద్రాస్ హైకోర్టు సూచన**

చెన్నై: సోషల్ మీడియా వినియోగంపై మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం కీలక సూచనలు చేసింది. ఆస్ట్రేలియాలో అమలు చేస్తున్న తరహాలోనే, 16 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు సోషల్ మీడియాను నిషేధించేలా చట్టం తీసుకురావాలనే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఎస్. విజయ్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై జస్టిస్ జి. జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇంటర్నెట్‌లో అశ్లీల చిత్రాలు, వీడియోలు సులభంగా అందుబాటులోకి రావడం వల్ల చిన్నారుల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని పిటిషనర్ తన వాదన వినిపించారు. చిన్నారులు ఇలాంటి కంటెంట్ చూడకుండా నిరోధించేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని కోరారు. పిటిషనర్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, అశ్లీల కంటెంట్‌ను నియంత్రించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. అయితే, ఇది కేవలం ఒక సూచన మాత్రమేనని, కచ్చితమైన ఆదేశం కాదని స్పష్టం చేసింది. అంతకంటే ముందుగా 16 ఏళ్ల లోపు పిల్లలను సోషల్ మీడియాకు పూర్తిగా దూరం చేసేలా చట్టం తీసుకురావడంపై కేంద్రం దృష్టి పెట్టాలని సూచించింది. అలాంటి చట్టం అమల్లోకి వచ్చేలోపు, ఈ అంశంపై చిన్నారులు, వారి తల్లిదండ్రుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, బాలల హక్కుల కమిషన్‌లను ఆదేశించింది. ఇటీవల ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఖాతాలు తెరవడాన్ని నిషేధిస్తూ చట్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధిస్తారు. ఈ నేపథ్యంలోనే మద్రాస్ హైకోర్టు ఈ తరహా చట్టాన్ని పరిశీలించాలని కేంద్రానికి సూచించడం గమనార్హం.

## తిరువనంతపురం మేయర్ పీఠం బీజేపీదే

**కమ్యూనిస్టుల కంచుకోట బద్దలు**



తిరువనంతపురం: కేరళ రాజకీయాల్లో బీజేపీ సరికొత్త చరిత్ర సృష్టించింది. తిరువనంతపురం కార్పొరేషన్ మేయర్‌గా బీజేపీ నేత వి.వి. రాజేశ్ (49) ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆయన 51 ఓట్లతో విజయం సాధించారు. రాష్ట్ర చరిత్రలో ఒక బీజేపీ నేత మేయర్ పీఠాన్ని అధిరోహించడం ఇదే తొలిసారి కావడంతో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ కూటమి (ఎల్‌డీఎఫ్) అభ్యర్థి ఆర్.పి. శివాజీకి 29 ఓట్లు రాగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. శబరినాథన్‌కు 19 ఓట్లు మాత్రమే లభించాయి. ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 101 మంది సభ్యులున్న కార్పొరేషన్‌లో మేయర్ పీఠానికి 51 ఓట్ల మ్యాజిక్ ఫిగర్ అవసరం. డిసెంబర్ 9న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ 50 వార్డులు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. గురువారం రాత్రి ఇండిపెండెంట్ కౌన్సిలర్ పి. రాధాకృష్ణన్ బీజేపీకి మద్దతు ప్రకటించడంతో వారి బలం 51కి చేరింది. దీంతో రాజేశ్ విజయం లాంఛనమైంది. ఈ విజయంతో దాదాపు 45 ఏళ్లుగా తిరువనంతపురం కార్పొరేషన్‌పై ఉన్న సీపీఎం ఆధిపత్యానికి తెరపడినట్లయింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సురేశ్ గోపి మాట్లాడుతూ, "ఇది గతసారే జరగాల్సింది. ఇప్పుడు మేం ఇక్కడ ఉన్నాం. ఇక రాష్ట్రవ్యాప్తంగా నెమ్మదిగా మార్పు మొదలవుతుంది" అని అన్నారు. అంతకుముందు, ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఫోన్ చేసి రాజేశ్ కు శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ఆశా నాథ్‌ను పార్టీ ఎంపిక చేసింది. రాజేశ్ విజయం ఖరారైన వెంటనే బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు.

## అయోధ్యలో కొరియా రాణి విగ్రహం

**సరయూ నది ఒడ్డున రాణి గౌరవార్థం స్మారక పార్కు నిర్మాణం**

**2000 ఏళ్ల క్రితం అయోధ్య నుంచి కొరియా వెళ్లిన యువరాణి**

**తమ పూర్వీకులు అయోధ్య వారని నమ్మే 60 లక్షల మంది కొరియన్లు**



అయోధ్య: భారత్, దక్షిణ కొరియాల మధ్య ఉన్న పురాతన సాంస్కృతిక బంధానికి ప్రతీకగా అయోధ్యలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో, కొరియా రాణి హెయో హ్వాంగ్-ఓక్ (సురిరత్న) కాంస్య విగ్రహాన్ని ఇటీవల ఆవిష్కరించారు. సుమారు 2000 ఏళ్ల క్రితం అయోధ్యకు చెందిన యువరాణి కొరియాకు వెళ్లి అక్కడి రాజును వివాహమాడారనే చారిత్రక విశ్వాసానికి గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొరియన్ ఇతిహాసాల ప్రకారం, క్రీ.శ. 48లో అయోధ్య రాజు తన కుమార్తె సురి రత్నను, దైవాజ్ఞ మేరకు సముద్ర మార్గంలో కొరియాకు పంపారు. అక్కడ ఆమె గయ సామ్రాజ్య స్థాపకుడైన రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు పది మంది సంతానం కలగగా, వారి వారసులనే నేడు దక్షిణ కొరియాలో 'కరక్' తెగగా పిలుస్తారు. సుమారు 60 లక్షల మంది ఉన్న ఈ తెగ ప్రజలు, తమ మూలాలు అయోధ్యలోనే ఉన్నాయని దృఢంగా విశ్వసిస్తారు. ఈ చారిత్రక అనుబంధాన్ని గౌరవిస్తూ 2001లోనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, దక్షిణ కొరియాలోని గిమ్హే నగరం కలిసి సరయూ నది ఒడ్డున రాణి సురి రత్న పేరుతో ఒక స్మారక పార్కును నిర్మించాయి. కొరియా ప్రతినిధుల కోరిక మేరకు ఇటీవల ఈ పార్కును మరింత సుందరీకరించి, తాజాగా రాణి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2018లో దక్షిణ కొరియా ప్రథమ మహిళ కిమ్ జంగ్-సూక్ భారత పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ఈ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించడం గమనార్హం. ప్రతి ఏటా కరక్ తెగకు చెందిన వందలాది మంది కొరియన్లు అయోధ్యకు వచ్చి తమ పూర్వీకురాలిని స్మరించుకుంటారు. ఈ విగ్రహ ఏర్పాటుతో అయోధ్య, గిమ్హే నగరాల మధ్య ఉన్న 'సోదర' బంధం మరింత బలపడింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య కేవలం దౌత్యపరమైన సంబంధాలకే కాకుండా, చారిత్రక, సాంస్కృతిక బంధానికి నిలువుటద్దంగా నిలుస్తోంది.

## బంగ్లాదేశ్ టూరిస్టులకు 'నో ఎంట్రీ'

**బెంగాల్ హోటళ్ల సంచలన నిర్ణయం**

డార్జిలింగ్: బంగ్లాదేశ్‌లో హిందూ గార్మెంట్ ఫ్యాక్టరీ కార్మికుడు దీపు చంద్ర దాస్‌ను అత్యంత దారుణంగా హత్య చేయడాన్ని నిరసిస్తూ పశ్చిమ బెంగాల్‌లోని రెండు జిల్లాల హోటళ్ల సంఘాలు సంచలన నిర్ణయం తీసుకున్నాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చే పర్యాటకులకు తమ హోటళ్లు, లాడ్జీలలో బస కల్పించబోమని ప్రకటించాయి. మహమ్మద్ యూనస్ పాలనలో మైనారిటీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశాయి. బంగ్లాదేశ్‌తో అంతర్జాతీయ సరిహద్దు పంచుకుంటున్న డార్జిలింగ్, మాల్దా జిల్లాల హోటల్ యజమానుల సంఘాలు ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. "మా సంఘంలోని సభ్యులందరూ ఏకగ్రీవంగా బంగ్లాదేశ్ పర్యాటకులకు గదులు కేటాయించకూడదని నిర్ణయించారు. ప్రస్తుతం మా జిల్లాలోని ఏ హోటల్‌లోనూ బంగ్లాదేశ్ టూరిస్టులు లేరు" అని మాల్దా హోటల్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణేందు చౌదరి తెలిపారు. వైద్య వీసాలపై చికిత్స కోసం వచ్చేవారికి ఈ నిషేధం వర్తింపజేయాలా? వద్దా? అనే అంశంపై త్వరలో మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుంటామని ఆయన వివరించారు. అయితే, డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి హోటలియర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించింది. వైద్య, విద్యార్థి వీసాలపై వచ్చే బంగ్లాదేశీయులకు కూడా ఈ నిషేధం వర్తిస్తుందని ఆ సంఘం కార్యదర్శి ఉజ్వల్ ఘోష్ స్పష్టం చేశారు. "సిలిగురి కారిడార్‌పై బంగ్లాదేశ్ నేతలు సున్నితమైన వ్యాఖ్యలు చేయడం, హిందూ మైనారిటీలపై దాడులు తీవ్రస్థాయికి చేరడం ఆమోదయోగ్యం కాదు" అని ఆయన అన్నారు. ఈ రెండు సంఘాల నిర్ణయానికి స్థానిక ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ మద్దతు ప్రకటించాయి. ఇటీవల బంగ్లాదేశ్‌లో దైవదూషణ ఆరోపణలతో 25 ఏళ్ల దీపు చంద్ర దాస్‌ను ఫ్యాక్టరీ నుంచి బయటకు లాక్కొచ్చి, కర్రలతో కొట్టి చంపి, చెట్టుకు కట్టేసి నిప్పంటించిన ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది.

## నైట్ డ్యూటీలతో రొమ్ము క్యాన్సర్

**బ్రెస్ట్ క్యాన్సర్‌కు నిద్రలేమికి లింక్.. తాజా అధ్యయనంలో షాకింగ్ నిజాలు**



టెక్సస్: తరచూ నైట్ షిఫ్టులలో పనిచేయడం లేదా వేర్వేరు టైమ్ జోన్‌లకు విమాన ప్రయాణాలు చేయడం వంటి కారణాలతో నిద్ర సమయాలు అస్తవ్యస్తంగా మారే మహిళలు వేగంగా రొమ్ము క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. శరీరంలోని 'జీవ గడియారం'దెబ్బతినడం వల్ల రొమ్ము గ్రంథుల నిర్మాణంలో మార్పులు రావడంతో పాటు రోగనిరోధక వ్యవస్థ బలహీనపడుతుందని టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ పరిశోధకులు తేల్చారు. ఈ పరిశోధనలో భాగంగా... బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చేలా జన్యుపరంగా మార్పులు చేసిన ఎలుకలను రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూపును సాధారణ పగలు-రాత్రి వాతావరణంలో, మరో గ్రూపును అస్తవ్యస్తమైన లైటింగ్ పరిస్థితుల్లో ఉంచి వాటి జీవ గడియారానికి అంతరాయం కలిగించారు. సాధారణ పరిస్థితుల్లో ఉన్న ఎలుకలకు 22 వారాల సమయంలో క్యాన్సర్ రాగా, నిద్రకు ఆటంకం కలిగిన గ్రూపులో కేవలం 18 వారాలకే క్యాన్సర్ లక్షణాలు కనిపించాయి. "మన అంతర్గత గడియారం దెబ్బతింటే, క్యాన్సర్ దానిని తనకు అనుకూలంగా మార్చుకుంటుంది" అని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన డాక్టర్ తపశ్రీ రాయ్ సర్కార్ తెలిపారు. నిద్ర సమయాలు మారిన ఎలుకలలో క్యాన్సర్ కణితులు వేగంగా పెరగడమే కాకుండా, ఊపిరితిత్తులకు కూడా వ్యాపించాయని గుర్తించారు. ఇది బ్రెస్ట్ క్యాన్సర్ రోగులలో ప్రమాదానికి సంకేతంగా భావిస్తారు. శరీర జీవ గడియారం దెబ్బతినడం వల్ల రోగనిరోధక వ్యవస్థ పనితీరు మందగించి, క్యాన్సర్ కణాలు సులభంగా పెరిగేందుకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని సర్కార్ వివరించారు. అంతేకాకుండా ఆరోగ్యవంతమైన రొమ్ము కణజాలంలో కూడా మార్పులు వచ్చి, భవిష్యత్తులో క్యాన్సర్‌కు మరింత ఎక్కువ ఆస్కారం కలుగుతోందని ఈ అధ్యయనం తేల్చింది. ఈ పరిశోధన వివరాలు 'ఆంకోజీన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## అమ్మకాలు రెండింతలు.. నష్టాలు మూడింతలు

**జెప్టో పరిస్థితి దారుణం.. పోటీ వల్లేనని వెల్లడి**

ముంబై: క్విక్ కామర్స్ సంస్థ జెప్టో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాల్లో అద్భుతమైన వృద్ధిని సాధించినప్పటికీ, నష్టాలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. కంపెనీ విడుదల చేసిన ఆర్థిక నివేదికల ప్రకారం.. అమ్మకాలు రెట్టింపు కాగా, నష్టాలు అంతకుమించి పెరిగాయి. వివరాల్లోకి వెళితే... 2024-25 ఆర్థిక సంవత్సరంలో జెప్టో మొత్తం అమ్మకాలు రూ. 9,668.8 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ. 4,223.9 కోట్లుగా ఉండగా, ఏకంగా 129 శాతం వృద్ధి కనిపించింది. అయితే, ఇదే సమయంలో కంపెనీ నికర నష్టం 177 శాతం పెరిగి రూ. 3,367.3 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ నష్టం రూ. 1,214.7 కోట్లు మాత్రమే. మార్కెట్లో పోటీ తీవ్రతరం కావడంతో కార్యకలాపాల విస్తరణ, కొత్త డార్క్ స్టోర్ల ఏర్పాటు, కస్టమర్లను ఆకర్షించడం కోసం భారీగా ఖర్చు చేయాల్సి రావడమే ఈ నష్టాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. టర్నోవర్‌తో పోలిస్తే నష్టాల వాటా ఎఫ్‌వై24లో 29 శాతంగా ఉండగా, ఎఫ్‌వై25 నాటికి అది 35 శాతానికి పెరిగింది. ఇలాంటి ఆర్థిక ఫలితాల నేపథ్యంలోనే జెప్టో పబ్లిక్ మార్కెట్లలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈరోజు ఐపీఓ కోసం రహస్యంగా ముసాయిదా పత్రాలను దాఖలు చేయనుందని సమాచారం. దీనికి అనుగుణంగా ఈ నెల 23న జరిగిన వాటాదారుల సమావేశంలో కంపెనీ వ్యవస్థాపకులు ఆదిత్య పాలిచా, కైవల్య వోహ్రా, సీఎఫ్ఓ రమేశ్ బఫ్నాలను పూర్తికాల డైరెక్టర్లుగా నియమిస్తూ బోర్డులో కీలక మార్పులు చేశారు.

## భారత్‌కు ముప్పుగా చైనా-పాక్ 'మిలిటరీ బంధం'

**అమెరికా రక్షణ శాఖ నివేదికలో కీలక విషయాలు**

పెంటగాన్: దక్షిణ ఆసియాలో చైనా వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. భారత్‌తో సరిహద్దు వివాదాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, మరోవైపు పాకిస్థాన్‌తో కలిసి భారత్ భద్రతను ప్రభావితం చేస్తోందని అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) తన తాజా నివేదికలో హెచ్చరించింది. కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్)కు సమర్పించిన ఈ వార్షిక నివేదికలో చైనా-పాక్ సైనిక భాగస్వామ్యం గురించి కీలక విషయాలను వెల్లడించింది. చైనాకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సైనిక భాగస్వాములలో పాకిస్థాన్ అత్యంత స్థిరమైన, ముఖ్యమైన భాగస్వామి అని నివేదిక పేర్కొంది. ఆయుధాల విక్రయం, ఉమ్మడి ఉత్పత్తి, సైనిక శిక్షణలో చైనా, పాక్ మధ్య సహకారం నిరంతరం పెరుగుతోంది. పాకిస్థాన్ సైనిక ఆధునికీకరణలో చైనా పరికరాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గగనతల, భూతల, నావికా రంగాల్లో అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను చైనా పాక్‌కు బదిలీ చేస్తోందని నివేదిక వివరించింది. చైనా-పాక్ సంబంధాల వల్ల భారత్‌కు రెండు వైపుల నుంచి (ఉత్తర, పశ్చిమ సరిహద్దులు) ఒత్తిడి పెరుగుతోందని పెంటగాన్ విశ్లేషించింది.

## స్కూళ్లలో వార్తాపఠనం తప్పనిసరి

**పాఠశాలలకు యూపీ ప్రభుత్వం ఆదేశాలు**

లక్నో: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఒక కీలక నిర్ణయం తీసుకుంది. తరగతి గదులను డిజిటల్ స్క్రీన్‌ల నుంచి పుస్తకాల వైపు మళ్ళించే ప్రయత్నంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని సెకండరీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు వార్తా పత్రికలు చదవడాన్ని తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. విద్యార్థుల్లో పుస్తక పఠనాసక్తిని పెంపొందించడానికి, డిజిటల్ స్క్రీన్ సమయాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా పాఠశాల గ్రంథాలయాల్లో హిందీ, ఇంగ్లీష్ వార్తా పత్రికలను అందుబాటులో ఉంచనున్నారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు చదివే అలవాటును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రాథమిక మరియు మాధ్యమిక విద్యా శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డిసెంబర్ 23న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పాఠశాలలు వార్తా పత్రికలను విద్యార్థుల దినచర్యలో భాగంగా చేయాలి. వీటిని ఐచ్ఛికంగా కాకుండా సాధారణ అభ్యాస సాధనంగా పరిగణించాలని ఆదేశించింది. హిందీ, ఇంగ్లీష్ వార్తా పత్రికలను అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

## పడిపోయిన సూచీలు

**ఐటీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి**



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఐటీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 367.25 పాయింట్లు నష్టపోయి 85,041.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 99.80 పాయింట్లు క్షీణించి 26,042.30 వద్ద ముగిసింది. సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ సెషన్లు తక్కువగా ఉండటం, మార్కెట్‌ను నడిపించే బలమైన సానుకూల సంకేతాలు లేకపోవడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో పాటు సెన్సెక్స్ డెరివేటివ్‌ల గడువు ముగియడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. బీఎస్ఈలో టైటన్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు లాభపడగా, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో టైటన్, హిందాల్కో, నెస్లే ఇండియా లాభపడిన వాటిలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టాలను చవిచూశాయి. విశాల మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.23 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.03 శాతం, ఆటో ఇండెక్స్ 0.52 శాతం పతనమయ్యాయి. అయితే, దీనికి భిన్నంగా మెటల్ షేర్లు రాణించడంతో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 0.59 శాతం లాభపడింది.

## అమెరికాలో వేల లైసెన్సులు రద్దు

**కాలిఫోర్నియా ప్రభుత్వం నిర్ణయం.. కోర్టుకెక్కిన భారతీయ డ్రైవర్లు**

న్యూయార్క్: అమెరికాలోని కాలిఫోర్నియా ప్రభుత్వం వాణిజ్య లైసెన్సులు రద్దు చేయడంతో వేలాది మంది డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని ఆరోపిస్తూ భారత సంతతికి చెందిన ట్రక్కు డ్రైవర్లు కాలిఫోర్నియా డిపార్ట్ మెంట్ ఆఫ్ మోటార్ వెహికిల్స్‌పై దావా వేశారు. సిక్కు కూటమి, ఆసియన్ లా కాకస్, లా ఫర్మ్ వీల్, గోట్షాల్ కలిసి ఈ కేసును దాఖలు చేశాయి. ప్రభుత్వం చర్య తమ జీవనాధారాన్ని ప్రమాదంలో పడేస్తోందని ట్రక్కు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. లైసెన్స్ గడువు తేదీల్లో సమస్యలు ఉన్నట్లు గుర్తించిన కాలిఫోర్నియా రవాణా ఏజెన్సీ ప్రవాస డ్రైవర్లకు జారీ చేసిన లైసెన్స్‌లను రద్దు చేయాలని ఇటీవల నిర్ణయించింది. దీని కారణంగా 20 వేల మంది వాణిజ్య డ్రైవింగ్ లైసెన్స్‌లపై ప్రభావం పడింది. గత నెల 17,000 మంది డ్రైవర్లకు 60 రోజుల పాటు లైసెన్స్‌ను రద్దు చేస్తూ నోటీసులు జారీ చేసింది. ఆ తర్వాత ఈ సంఖ్య మరింత పెరిగింది. అయితే, రవాణా ఏజెన్సీ చేసిన పొరపాట్ల కారణంగానే లైసెన్సుల రద్దు అయ్యాయని పౌర హక్కుల సంఘాలు ఆరోపించాయి. వాటిని సరిదిద్ది లైసెన్స్‌లను పునరద్ధరించాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో లైసెన్సుల రద్దు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ట్రక్కు డ్రైవర్లు కోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై స్పందించేందుకు రవాణా ఏజెన్సీ నిరాకరించింది.






# నేడే మెగా విక్టరీ మాస్ సాంగ్ ప్రోమో

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమాను దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తుండగా ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ కేమియో రోల్‌లో నటిస్తుండటంతో ఈ మూవీ ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందా అని ఫ్యాన్స్ ఆతృతగా చూస్తున్నారు. అయితే ఈ సినిమా నుంచి ఇప్పుడు వరుస అప్డేట్స్ ఇస్తూ మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ సినిమా నుండి ఇప్పటికే రెండు సింగిల్ సాంగ్స్ రిలీజ్ చేసిన మేకర్స్, ఇప్పుడు తాజాగా ఈ చిత్రం నుంచి మూడో సాంగ్‌ను రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. 'మెగా విక్టరీ మాస్' సాంగ్‌ను డిసెంబర్ 30న రిలీజ్ చేస్తుండగా ఈ సాంగ్ ప్రోమోను శనివారం రిలీజ్ చేస్తున్నట్లు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. ఈ సాంగ్‌తో శంకర వరప్రసాద్ గారు ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందా? అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.



## అడల్ట్ కంటెంట్ సినిమాలు చేయను

చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ స్టార్ట్ చేసిన తేజ సజ్జా.. వరుస హిట్లతో దూసుకుపోతున్నాడు. తాజాగా ఓ చిట్ చాట్ లో పాల్గొన్నాడు. టాలీవుడ్ మార్కెట్ చాలా పెద్దదిగా మారిందని, ఫ్యామిలీ ఆడియన్స్ తో పాటు పిల్లలు థియేటర్స్ కు వస్తే ఇండస్ట్రీ ఇంకా ఎక్స్టెండ్ అవుతుందని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో తానెప్పుడూ అడల్ట్ కంటెంట్‌కు నో చెబుతానని, అలాంటి సీన్స్ చూసేందుకు తనకు అభ్యంతరం లేదని చెప్పారు. కానీ తన సినిమాలు చూడటానికి ఫ్యామిలీ ఆడియన్స్ తమ పిల్లలతో కలిసి థియేటర్లకు వస్తున్నారని చెప్పిన తేజ.. వాళ్లంతా ఇబ్బంది పడతారని అన్నారు. అందుకే అలాంటి కంటెంట్ లో నటించకూడదని నిర్ణయం తీసుకున్నానని తెలిపారు.



## రాజా సాబ్ గ్రాండ్ ప్రీ రిలీజ్ నేడే

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మొత్తం ముగ్గురు హీరోయిన్స్ రిద్ధి కుమార్, మాళవిక మోహనన్ అలాగే నిధి అగర్వాల్ లతో దర్శకుడు మారుతీ తెరకెక్కిస్తున్న సాలిడ్ హారర్ ఎంటర్టైనర్ చిత్రమే ది రాజా సాబ్. అభిమానుల్లో మంచి బజ్ ని సొంతం చేసుకున్న ఈ సినిమా ఒకో కంటెంట్ తో వింటేజ్ ప్రభాస్ ని చూపిస్తుంది. ఇక ఈ సినిమాకి సంబంధించి మేకర్స్ ఒక ఉహించని సర్ప్రైజ్ అప్డేట్ ఇచ్చారు. సినిమా రిలీజ్ కి వారమో ఐదారు రోజులు ఉండగా పెట్టుకోకుండా గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను శనివారమే గ్రాండ్‌గా చేస్తున్నట్టు కన్ఫర్మ్ చేశారు. ఈ ఈవెంట్‌ని హైదరాబాద్ లోనే చేస్తున్నట్టుగా.. ప్లేస్‌ని ఫిక్స్ చేయగా రేపు సాయంత్రం 5 గంటల నుంచి ఈవెంట్ హంగామా మొదలు కానుంది.

## రాజు గారి పెళ్లి రో..!



యంగ్ హీరో నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'అనగనగా ఒక రాజు' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు మారి తెరకెక్కిస్తుండగా ఈ చిత్రాన్ని 2026 జనవరి 14న సంక్రాంతి కానుకగా ఘనంగా విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది. విభిన్నమైన కథాంశాలతో ప్రేక్షకులను అలరించే నవీన్, ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తన మ్యాజిక్ రిపీట్ చేయడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్ర ప్రమోషన్లలో భాగంగా తాజాగా సినిమాలోని టైటిల్ సాంగ్ 'రాజు గారి పెళ్లి రో'ను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల సమక్షంలో ఈ పాటను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ వేడుకలో నవీన్ పోలిశెట్టి ఎంతో ఉత్సాహంగా కనిపించగా, హీరోయిన్ మీనాక్షి చౌదరి తన అందంతో అందరినీ ఆకట్టుకున్నారు.



## చైతూ కోసం 'సితార' జబర్దస్త్ ప్లాన్



సితార ఎంటర్టైన్మెంట్స్ టాలీవుడ్ లో ప్రస్తుతం స్మాల్, మీడియం నుంచి భారీ బడ్జెట్ సినిమాలు చేస్తున్న నిర్మాణ సంస్థ. సూర్యదేవర నాగ వంశీ ఈ బ్యానర్ లో వరుస సినిమాలు నిర్మిస్తున్నారు. ఐతే ఈ బ్యానర్ లో మొదటి సినిమాగా వచ్చింది శైలజా రెడ్డి అల్లుడు. నాగ చైతన్య తోనే ఈ బ్యానర్ మొదలైంది. ఆ తర్వాత సక్సెస్ ఫుల్ సినిమాలు చేస్తూ ఆడియన్స్ ని అలరిస్తుంది. 2018లో నాగ చైతన్యతో శైలజా రెడ్డి అల్లుడు చేసిన సితార నాగ వంశీ ఈ ఏడేళ్లలో ఎన్నో సినిమాలు చేశారు. ఐతే మళ్లీ నాగ చైతన్యతో చేసే అవకాశం రాలేదు.

## హిందువును చంపేస్తే కిక్కురుమనరేం?: జాన్వీ కపూర్

బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై గత కొన్ని నెలలుగా నరమేధం జరుగుతోంది. ఎక్కడ హిందులు కనిపిస్తే రాక్షసత్వంగా చంపేస్తూ బంగ్లాదేశ్ దేశ్‌లో మారణహోమం జరుగుతోంది. ఇటీవల 27 ఏళ్ల దీపు చంద్రదాస్ అనే యువకుడిని చంపి నడిరోడ్డుపైచెట్టుకు కట్టేసి కాల్చేయడం కలకలం సృష్టించింది. ఈ సంఘటనపై బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు ఏ ఒక్క సెలబ్రిటీ స్పందించడం లేదు. హీరోయిన్ కాజల్ అగర్వాల్, జయప్రద వంటి వారు మాత్రమే స్పందించారు. మిగతా వారు మాత్రం ఆ ధైర్యం చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ సోషల్ మీడియా వేదిక షేర్ చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. దీపు చంద్రదాస్ ని హత్య చేయడాన్ని బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హత్యాకాండగా అభివర్ణించింది. ప్రజలంతా దీన్ని ముక్తకంఠంతో వ్యతికేరించాలని కోరింది. దీపు చంద్రదాస్ అనే శీర్షికతో ఇన్‌స్టాగ్రామ్‌లో జాన్వీ ఓ నోట్‌ని షేర్ చేసింది. 'బంగ్లాదేశ్‌లో జరుగుతున్నది అనాగరికం.



## మార్చిలో అఖిల్ 'లెనిన్'

టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని అఖిల్ చేస్తున్న లెనిన్ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్తూరు బ్యాక్ డ్రాప్ లో రూరల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న లెనిన్ మూవీకి నందు (మురళీ కిషోర్ అబ్బూరి) దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్ పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. తాజాగా నాగవంశీ సినిమాకు సంబంధించిన క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. లెనిన్ మూవీ గురించి మాట్లాడారు. మార్చిలో లెనిన్ మూవీ రానుందని నాగవంశీ తెలిపారు. ఇప్పటికే వచ్చిన అవుట్ పుట్ అదిరిపోయిందని చెప్పారు. రెండు మూడు రోజుల్లో ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేస్తామని తెలిపారు. దీంతో న్యూ ఇయర్ కానుకగా లెనిన్ సాంగ్‌ను విడుదల చేస్తున్నట్లు తెలుస్తోంది.

## బికినీలో.. అనన్య హొయలు



అనన్య పాండే.. బాలీవుడ్ బ్యూటీగా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఈమె తాజాగా నటించిన చిత్రం 'తు మేరీ మైన్ తేరా మైన్ తేరా తు మేరీ'. కార్తీక్ ఆర్యన్ హీరోగా వచ్చిన ఈ సినిమా క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. క్రిస్మస్ సందర్భంగా విడుదలైన ఈ సినిమా మొదటి రోజే 8.46 కోట్ల కలెక్షన్స్ వసూలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ధర్మ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సమీర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఇప్పుడు ప్రేక్షకులను అలరిస్తోంది అని చెప్పవచ్చు. ఇకపోతే ఈ సినిమా నిన్న థియేటర్లలోకి రావడంతో సినిమాపై మరింత బజ్ క్రియేట్ చేయడానికి సినిమా షూటింగ్ సమయంలో తీసుకున్న కొన్ని ఫోటోలను అలాగే ఆ సినిమా షూటింగ్ సంబంధించిన మధుర క్షణాలను అభిమానులతో పంచుకుంది అనన్య పాండే. అంతేకాదు బికినీ అందాలు ఆరబోస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. గ్లామర్ డోస్ పెంచేసి బికినీ అందాలతో రచ్చ రేపింది అనన్య పాండే. పైగా ఈ సినిమా షూటింగ్ సమయాన్ని ఎప్పటికీ మర్చిపోలేను అంటూ క్యాప్షన్ కూడా జోడించింది.




# టీ20 సిరీస్ మనదే

## టీమిండియా హ్యాట్రిక్ విజయాలు.. మూడో టీ20లో శ్రీలంకపై ఘన విజయం

వరల్డ్ ఛాంపియన్ భారత జట్టు స్వదేశంలో తొలి సిరీస్ పట్టేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ(79 నాటౌట్) విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగగా.. మూడో టీ20లోనూ భారీ విజయంతో సిరీస్ పట్టేసింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టుకు కనీస పోటీ ఇవ్వలేకపోతున్న లంక త్రివేండ్రంలోనూ చతికిలపడింది. రేణుకా సింగ్(4-21)తో నిప్పులు చెరగగా.. స్వల్ప ఛేదనలో షఫాలీ ఉప్పెనలా విరుచుకుపడింది. అంతే.. 13.2 ఓవర్లలోనే విక్టరీ కొట్టిన భారత్.. మరో రెండు మ్యాచ్‌లుండగానే సిరీస్ పట్టేసింది.



## రోహిత్‌ను డకౌట్ చేసిన దేవంద్ర సింగ్ బోరా!

రోహిత్ శర్మ బ్యాటింగ్ చేస్తుంటే బౌలింగ్ వేసేవాడికి, ఫీల్డింగ్ చేసేవాడికి చుక్కలు కనిపిస్తాయి. సొగసైన ఆటతో పరుగుల వరద పారిస్తాడు. అయితే, రోహిత్ శర్మనే డకౌట్ చేశాడో కుర్ర క్రికెటర్. అతడి పేరు దేవంద్ర సింగ్ బోరా. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను గోల్డెన్ డకౌట్ చేసిన ఈ దేశవాళీ పేసర్.. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న రోహిత్ శర్మను తాను ఎదుర్కొన్న తొలి బంతికే క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ 2025-26ని భారీ శతకంతో ప్రారంభించిన రోహిత్ శర్మ.. దేవంద్ర సింగ్ బోరా ధాటికి రెండో మ్యాచ్‌లో గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరగాడు. ఎలైట్ గ్రూప్-సీలో భాగంగా జైపూర్ వేదికగా ముంబై వర్సెస్ ఉత్తరఖాండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముంబై టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగగా.. తొలి ఓవర్‌లోనే ఎదుర్కొన్న తొలి బంతికే రోహిత్ శర్మ క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు.

## వైభవ్ సూర్యవంశీకి బాలల అవార్డు



భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి శుక్రవారం చిరస్మరణీయమైన రోజుగా నిలిచింది. కేవలం 14 ఏళ్ల వయసులోనే వైభవ్ ప్రతిష్టాత్మకమైన ప్రధానమంత్రి జాతీయ బాలల అవార్డును అందుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు. ఈ అవార్డును న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అతడికి ప్రదానం చేశారు. భారతదేశంలో 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు గల పిల్లలకు క్రీడలు, వీరత్వం, వినూత్న ఆలోచనలు, విజ్ఞానం, సామాజిక సేవ, సంస్కృతి వంటి రంగాల్లో అసాధారణ ప్రతిభ చూపిన వారికి ఈ అవార్డును అందజేస్తారు. ఈ ఏడాది మొత్తం 20 మంది పిల్లలను ఈ అవార్డుకు ఎంపిక చేయగా, అందులో వైభవ్ సూర్యవంశీ ఒకరిగా నిలిచాడు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరుకావాల్సి రావడంతో వైభవ్, బిహార్ జట్టు తరఫున విజయ్ హజారే ట్రోఫీ 2025%-%26 సీజన్‌లో రెండో మ్యాచ్‌కు దూరమయ్యాడు.



## ఒకే రోజు కూలిన 20 వికెట్లు

### ఇంగ్లండ్‌పై 46 రన్స్ ఆధిక్యంలో ఆసీస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు తొలి రోజే 20 వికెట్లు కూలాయి. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 152 రన్స్‌కు ఆలౌట్ అవ్వగా, ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆడిన ఇంగ్లండ్ కేవలం 110 రన్స్‌కే కుప్పకూలింది. అయితే ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో నాలుగు రన్స్ చేసిన ఆస్ట్రేలియా ఇప్పటి వరకు 46 పరుగుల ఆధిక్యంలో ఉన్నది. తొలి మూడు టెస్టులను గెలుచుకుని టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకున్న ఆస్ట్రేలియా .. నాలుగవ టెస్టులోనూ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. కానీ ఇవాళ ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాను ఇంగ్లండ్ బౌలర్ జోష్ టాంగ్ దెబ్బతీశాడు. అతను 45 రన్స్ ఇచ్చి అయిదు వికెట్లు తీసుకున్నాడు. ఆస్ట్రేలియా క్రమంగా తన వికెట్లను కోల్పోయింది. బ్యాటర్లు ఎవరూ హాఫ్ సెంచరీ చేయలేదు. మైఖేల్ నీసర్ అత్యధికంగా 35 రన్స్ చేశాడు. ఇక ఇంగ్లండ్ కూడా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో దారుణంగా విఫలమైంది. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఆ జట్టు మెల్‌బోర్న్ పిచ్‌పై ఏమాత్రం నిలవలేకపోయింది. ఆసీస్ పేస్ బౌలర్ల దాడికి మళ్లీ చేతులెత్తేసింది. ఇంగ్లండ్ టాప్ ఆర్డర్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ ఒక్కడే రాణించాడు. అతను అత్యధికంగా 41 రన్స్ స్కోరు చేశాడు. చివరలో అట్కిన్సన్ కొన్ని మెరుపులు మెరిపించాడు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నీసర్ 4, బోలాండ్ 3, స్టార్క్ రెండు వికెట్లు తీసుకున్నారు.

## నాటౌట్ 'కింగ్'.. బేవాన్ కాదు కోహ్లీ!




విజయ్ హజారే ట్రోఫీలోనూ ఆడుతున్న కింగ్ కోహ్లీ.. రికార్డుల దుమ్ము దులుపుతున్నాడు. తొలి మ్యాచ్‌లోనే శతకంతో రెచ్చిపోయిన భారత స్టార్.. గుజరాత్‌పై అర్ధ శతకంతో మరో రికార్డు పట్టేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యధిక సగటు నమోదు చేశాడు. ఇటీవల కాలంలో సూపర్ ఫామ్ కొనసాగిస్తున్న కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీతో తడాఖా చూపిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ లక్ష్యంగా పదిహేనేళ్ల తర్వాత ఈ లీగ్‌లో ఆడుతున్న అతడు.. విధ్వంసక ఆటతో అందర్నీ ఫిదా చేస్తున్నాడు. శుక్రవారం గుజరాత్‌పై హాఫ్ సెంచరీతో కదం తొక్కిన విరాట్ మళ్లీ వంద కొట్టేలా కనిపించాడు. కానీ, 77 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అయినా సరే.. అత్యధిక సగటుతో ఆస్ట్రేలియా మాజీ ఫినిషర్ మైఖేల్ బెవాన్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును దాటేశాడు. 'నాటౌట్ కింగ్'గా పేరొందిన బెవాన్ సగటు లిస్ట్ ఏ క్రికెట్‌లో 57.86 కాగా.. కోహ్లీ 57.87తో అతడిని అధిగమించాడు. లిస్ట్ ఏలో సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొడుతూ అత్యల్ప మ్యాచుల్లోనే 16 వేల క్లబ్‌లో చేరాడు విరాట్. ప్రస్తుతం 343 మ్యాచుల్లో 57.60 సగటుతో 16,130 రన్స్ బాదాడు. ఇందులో 58 సెంచరీలు, 84 అర్ధ శతకాలు ఉన్నాయి.

## విశాల్ జైస్వాల్.. టాక్ ఆఫ్ ది నేషన్!

విశాల్ జైస్వాల్.. ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో ట్రెండ్ అవుతున్న పేరు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీతో పాటు వికెట్ కీపర్ రిషభ్ పంత్‌ను ఔట్ చేయడం ద్వారా ఈ కుర్రాడు టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ 2025-26లో ఢిల్లీ తరఫున బరిలోకి దిగిన విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్‌ను గుజరాత్ స్పిన్నర్ విశాల్ జైస్వాల్ పెవిలియన్ చేర్చాడు. అద్భుతమైన బంతితో విరాట్ కోహ్లీని బోల్తా కొట్టించిన విశాల్.. వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్ సాయంతో స్టంపౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. స్టన్నింగ్ డెలివరీతో రిషభ్ పంత్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. విశాల్ జైస్వాల్ ధాటికి కోహ్లీ(77), రిషభ్ పంత్(70) శతకాలను చేజార్చుకున్నారు. ఈ ఇద్దరితో పాటు ఢిల్లీ ఓపెనర్ అర్పిత్ రాణా(10), మిడిలార్డర్ బ్యాటర్ నితీష్ రాణా(12)లను కూడా విశాల్ పెవిలియన్ చేర్చాడు. మొత్తం నాలుగు వికెట్ల (4/42)తో ఢిల్లీ పతనాన్ని శాసించించాడు. విశాల్ ధాటికి ఢిల్లీ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 254 పరుగులకే పరిమితమైంది. కోహ్లీ, రిషభ్ పంత్‌లను ఔట్ చేసిన విశాల్ జైస్వాల్ గురించి తెలుసుకునేందుకు నెటిజన్లు ఆసక్తి కనబరుస్తున్నారు.

## గుకేశ్‌తో ఆట అంత ఈజీ కాదు: మాగ్నస్ కార్ల్‌సన్

భారత కుర్రాళ్లతో తలపడడం కష్టమేనని అంటున్నాడు. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్. ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌ను పురస్కరించుకొని మాట్లాడిన ఈ నార్వే లెజెండ్ మాజీ ఛాంపియన్ డి.గుకేశ్‌తో ఆడడం ఎల్లప్పుడూ సవాల్‌గానే ఉంటుందని అన్నాడు. దోహాలోని ఖతార్‌లో జరుగుతున్న ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్ ఫేవరెట్‌గా ఆడుతున్నాడు. ఈ టోర్నీలో జూనియర్ల నుంచి తనకు గట్టి పోటీ ఎదురుకానుందని చెబుతున్న అతడు భారత కుర్రాడు గుకేశ్‌తో ముప్పేనని అంటున్నాడు. 'గత కొన్ని రోజులుగా నేను యంగ్‌స్టర్స్‌తో మ్యాచ్‌లు ఆడలేదు. వారు ఈ మధ్య చాలా గొప్పగా ఆడుతున్నారు. ముఖ్యంగా గుకేశ్ అదరగొడుతున్నాడు. 16 నుంచి 22 ఏళ్లున్న యువకెరటాలతో ప్రమాదం పొంచి ఉంటుంది' అని కార్ల్‌సన్ తెలిపాడు. ఈ ఏడాది నార్వే చెస్‌లో గుకేశ్ వ్యూహాలకు బదులివ్వలేక కార్ల్‌సన్ చేతులెత్తేశాడు. వరల్డ్ నంబర్1ను ఓడించి వార్తల్లో నిలిచాడు భారత గ్రాండ్‌మాస్టర్. అయినా సరే గుకేశ్‌ను తాను గ్రేట్ ప్లేయర్‌గా కాకుండా యంగ్‌స్టర్‌గానే చూస్తానని అంటున్నాడీ చెస్ కింగ్.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 27-12-2025 | www.evarthalu.com

# బజారు భాష.. రాజకీయ భాష

తెలంగాణ రాజకీయాల్లో గత కొద్దిరోజులుగా వినిపిస్తున్న భాషా ప్రయోగాలు ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న పదజాలం, ఆయన చేస్తున్న 'బూతు పురాణం' ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒక రాష్ట్రానికి దిశానిర్దేశం చేయాల్సిన పదవిలో ఉండి, వీధి స్థాయి భాషను వాడటం పట్ల ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం మాటల వల్ల ప్రభుత్వ ప్రతిష్ట దిగజారుతుండటంతో, కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఆ తప్పును కప్పిపుచ్చే ప్రయత్నాల్లో పడ్డారు. గతంలో కేసీఆర్ వాడిన భాషనే తాము వాడుతున్నామని, ఆయన వల్లే తాము ఇలా మాట్లాడాల్సి వస్తోందని చేస్తున్న ఎదురుదాడి హాస్యాస్పదంగా ఉంది. 'ఆయన వాడారు కాబట్టి మేము వాడుతున్నాం' అనడం బాధ్యతాయుతమైన ప్రభుత్వం చెప్పాల్సిన సమాధానం కాదు. తప్పును మరొక తప్పుతో సమర్థించుకోవడం అంటే ప్రజాస్వామ్య విలువలను మరింతగా దిగజార్చడమే. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజం. కానీ, అవి విధానపరమైన విభేదాలకు పరిమితం కావాలి తప్ప, వ్యక్తిగత దూషణలకు, అసభ్య పదజాలానికి వేదిక కాకూడదు. సీఎం స్థాయి వ్యక్తి వాడే ప్రతి మాట సమాజంపై, ముఖ్యంగా యువతపై ప్రభావం చూపుతుంది. అధికారంలో ఉన్నామన్న అహంకారంతోనో లేదా ప్రత్యర్థులపై పైచేయి సాధించాలన్న ఆత్రుతతోనో హుందాతనాన్ని విస్మరిస్తే, ప్రజల్లో 'చులకన' భావం ఏర్పడటం ఖాయం. కాంగ్రెస్ నాయకులు ఒకటి గుర్తుంచుకోవాలి. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. ఎవరి భాష ఎలా ఉంది? ఎవరు ఏ ఉద్దేశంతో మాట్లాడుతున్నారు? అన్న విషయాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. గత పాలకుల భాషను తప్పుబట్టి మార్పు కోరుకున్న ప్రజలకు, ఇప్పుడు అదే తరహా భాషను వినిపించడం మార్పు అనిపించుకోదు. అధికారం శాశ్వతం కాదు, కానీ రాజకీయ నాయకులు వదిలి వెళ్లే సంప్రదాయాలు, విలువలు శాశ్వతంగా ఉండిపోతాయి. అధికార పక్షం ఇప్పటికైనా తన భాషను సంస్కరించుకోవాలి. సమస్యల మీద చర్చ, అభివృద్ధి మీద పోరాటం ఉండాలి తప్ప, బూతుల మీద కాదు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, హుందాతనంతో కూడిన పాలనను అందించడమే కాంగ్రెస్ ముందున్న అసలైన సవాలు.

– ఈవార్తలు సంపాదకీయ విభాగం



# సుఖం.. నరకం!



భారతీయ సమాజంలో వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల బంధం మాత్రమే కాదు, అదొక పవిత్రమైన అనుబంధం. రెండు కుటుంబాల కలయిక, భవిష్యత్ తరాలకు పునాది. అయితే, ఆధునిక జీవనశైలి, సాంకేతిక పరిజ్ఞానం, మారుతున్న ఆలోచనా విధానాల నేపథ్యంలో వివాహ వ్యవస్థ పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా, వివాహేతర సంబంధాలు కుటుంబ బంధాలను ప్రభావితం చేస్తూ, సమాజంలో ఆందోళన కలిగిస్తున్నాయి. గతంలో వివాహ బంధాలకు ఎక్కువ విలువ ఉండేది. కుటుంబ గౌరవం, సామాజిక కట్టుబాట్లు, నైతిక విలువలకు పెద్దపీట వేసేవారు. అయితే, నేడు వ్యక్తిగత స్వేచ్ఛ, ఆనందానికి ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. దీనితో పాటు, సోషల్ మీడియా ప్రభావం, సినిమాల్లో చిత్రీకరణ, ఇతర కారణాల వల్ల వివాహేతర సంబంధాల పట్ల ఆకర్షితులు అవుతున్నారు. ఇది కుటుంబ సంబంధాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

వివాహేతర సంబంధాలకు దారితీస్తున్న కారణాలను పరిశీలిస్తే వ్యక్తిగత అసంతృప్తి, భాగస్వాముల మధ్య కమ్యూనికేషన్ లేకపోవడం, ఆర్థిక సమస్యలు, నైతిక విలువల పతనం, మానసిక ఒత్తిళ్లు వంటి అనేక అంశాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో, క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నాయి. వివాహేతర సంబంధాలు మరియు కుటుంబ కలహాల వల్ల అత్యంత దారుణంగా ప్రభావితమయ్యేది పిల్లలు. తల్లిదండ్రుల మధ్య సఖ్యత లేకపోవడం, వారి విడిపోవడం పిల్లల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వారికి తగిన ప్రేమ, రక్షణ లభించక వారి భవిష్యత్తు అంధకారంలో పడుతుంది. ఈ సమస్యకు చట్టపరమైన పరిష్కారాలు మాత్రమే కాకుండా, సామాజికంగా, వ్యక్తిగతంగా మార్పు రావాల్సిన అవసరం ఉంది. చిన్నతనం నుంచే పిల్లలకు కుటుంబ విలువలు, బంధాల గొప్పతనం గురించి నేర్పాలి. భాగస్వాముల మధ్య స్పష్టమైన కమ్యూనికేషన్, ఒకరి పట్ల ఒకరు గౌరవం కలిగి ఉ ండటం ముఖ్యం. సమస్యలు వచ్చినప్పుడు పెద్దల లేదా నిపుణుల సలహాలు తీసుకోవాలి. వ్యక్తిగత ఆనందం కంటే కుటుంబ బాధ్యతలకు, నైతిక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కుటుంబ సమస్యలను పరిష్కరించడానికి, మానసిక మద్దతు అందించడానికి కౌన్సెలింగ్ కేంద్రాల పాత్ర చాలా ముఖ్యం. వివాహ వ్యవస్థ అనేది ఆరోగ్యకరమైన సమాజానికి పునాది. ఈ వ్యవస్థను



పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆలోచనల్లో మార్పు అవసరమే అయినప్పటికీ, నైతిక విలువలను విస్మరించడం సమాజానికి మంచిది కాదు. కుటుంబ బంధాలను బలోపేతం చేయడం ద్వారా, వ్యక్తిగత బాధ్యతను గుర్తించడం ద్వారా వివాహేతర సంబంధాల వల్ల తలెత్తుతున్న సమస్యలకు అడ్డుకట్ట వేయవచ్చు. రేపటి తరానికి మంచి భవిష్యత్తును అందించడం మనందరి కర్తవ్యం.

### ఇటీవలి ప్రధాన హత్యోదంతాలు(డిసెంబర్ 2025):

- హైదరాబాద్ (బోడుప్పల్): శ్రీనిధి యూనివర్సిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న వీజే అశోక్ (45)ను అతని భార్య పూర్ణిమ, తన ప్రియుడు మహేశ్‌తో కలిసి డిసెంబర్ 11న హత్య చేసింది. తొలుత దీనిని గుండెపోటుగా నమ్మించే ప్రయత్నం చేసినప్పటికీ, పోలీసుల విచారణలో నిజాన్ని అంగీకరించింది.
- మహబూబాబాద్ (మంచ తండా): వీరన్న అనే వ్యక్తిని అతని భార్య, తన ప్రియుడు బాలాజీతో కలిసి డిసెంబర్ 24న హత్య చేయించింది. మద్యం తాగించి తలపై రాడ్‌తో కొట్టి చంపి, ప్రమాదవశాత్తు జరిగిన మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు.
- హైదరాబాద్ (మీర్‌పేట): మరదలితో అక్రమ సంబంధం పెట్టుకున్న మాజీ ఆర్మీ జవాన్ గురుమూర్తి, దానికి అడ్డుపడుతోందనే కారణంతో భార్య మాధవిని హత్య చేశాడు. ఈ కేసు విచారణలో డిసెంబర్ 20న కీలక ఆధారాలను పోలీసులు కోర్టుకు సమర్పించారు.
- హైదరాబాద్ (మీర్‌పేట): అక్టోబర్ 2025లో సంధ్య అనే మహిళ తన వివాహేతర సంబంధం గురించి గొడవ జరిగినప్పుడు, భర్త విజయ్ కుమార్‌ను ఐరన్ రాడ్‌తో కొట్టి చంపింది.

### ఈ ఏడాది నమోదైన ఇతర ఘటనలు:

- నాగర్ కర్నూల్: ఆగస్టులో సోమశిల చూపిస్తానంటూ భార్యను తీసుకెళ్లి, అనుమానంతో పెట్రోల్ పోసి తగులబెట్టి చంపిన భర్త ఘటన వెలుగుచూసింది.
- హైదరాబాద్ (అమీన్‌పూర్): నవంబర్‌లో భార్య కృష్ణవేణికి వేరే వ్యక్తితో సంబంధం ఉందనే అనుమానంతో భర్త బ్రహ్మయ్య క్రికెట్ బ్యాట్‌తో కొట్టి ఆమెను అక్కడికక్కడే చంపేశాడు.
- శ్రీసత్యసాయి జిల్లా(ఏపీ): జనవరి నుంచి జూలై 2025 వరకు ఒక్క ఈ జిల్లాలోనే వివాహేతర సంబంధాల కారణంగా ఏడు హత్యలు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి.

### కారణాలివీ..

- సోషల్ మీడియా, డేటింగ్ యాప్‌ల ద్వారా ఏర్పడే సాన్నిహిత్యం దంపతుల మధ్య దూరాన్ని పెంచి నేరాలకు దారితీస్తోంది.
- క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు, నైతిక విలువల పతనం కారణంగా భాగస్వాములను అడ్డుతొలగించుకునేందుకు సుపారీ హత్యలకు కూడా వెనుకాడటం లేదు.
- హత్యల వల్ల తండ్రి మరణించడం, తల్లి జైలుకు వెళ్లడంతో పిల్లలు అనాథలుగా మారుతున్న సందర్భాలు పెరిగాయి.
- గృహ హింస, వివాహేతర సంబంధాల వల్ల జరిగే హత్యల తీవ్రత మాత్రం తగ్గలేదని పోలీసు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.